ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 తిరుపతి జిల్లా వార్తలు

ఆదివారం 14 ఏప్రిల్ 2024

అంబేడ్కర్ సాక్షిగా.. ఐదేళ్ల అరాచకం

దళితులపై దాడులు.. దౌర్జన్యాలు.. వేధింపులు..



నా ఎస్సీలూ.. నా ఎస్టీలూ.. నా బీసీలూ.. నా మైనారిటీలూ.. అని ముఖం నిండా అమాయకత్వం నింపుకుని నమ్మబలికే నాయకుల మాటలన్నీ అబద్ధాలే! ఎన్నికల్లో ఓట్లు అవసరం అయినపుడూ, అంబేడ్కర్, పూలే, జగ్జీవన్‌రాం వంటి మహనీయుల వర్ధంతి, జయంతి రోజుల్లో మాత్రమే ఎస్సీలు గుర్తుకొస్తారు. ఊపిరాడనంతగా విగ్రహాలను పూలదండలతో ముంచెత్తి, ఉపన్యాసాలతో ఊగిపోతారు. ఆ తర్వాత అణగారిన వర్గాలను గాలికొదిలేస్తారు. అగ్రవర్ణ సామాజిక వర్గాలకు పెద్దపీట వేస్తారు. పేరుకు పదవులిచ్చి, అధికారం తమ దగ్గరే దాచుకుంటారు. అందుకు నిలువెత్తు నిదర్శనమే ఈ ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలన. జిల్లాలో దళితులను అవమానించి, దౌర్జన్యాలు చేసి, వారి భూములు లాక్కుని ఇప్పుడు మళ్లీ ఇంకో ఛాన్సు ఇవ్వండంటూ అడుగుతున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఇచ్చిందెంత.. లాక్కున్నదెంత?

నవరత్నాల నిధులు ఇచ్చి దళితుల జీవితాలు మార్చేశాం అంటూ వైసీపీ గొప్పలు చెప్పుకుంటోంది. నిజానికి బటన్ నొక్కి చేసిన సాయంకన్నా దొంగదారుల్లో వారి నుంచి లాక్కున్నదే ఎక్కువ. ఐదేళ్ల కిందట నెలకు కరెంటు బిల్లు ఎంత వచ్చేది.. ఇప్పుడు ఎన్ని రెట్లు పెరిగింది అని పోల్చుకుంటే చాలు అమ్మ జగనా! అనకుండా ఉండలేరు. సంపూర్ణంగా మద్యం నిషేధించిన తర్వాతే మీ ముందుకు వచ్చి ఓట్లు అడుగుతా అని ప్రకటించిన జగన్ జె బ్రాండ్ చీప్ లిక్కర్‌ను ముంచెత్తి దండుకుంటున్నారు. పేద దళిత కుటుంబాల్లో సంపాదన అంతా మగవాళ్ల మద్యానికే సమర్పించుకోవాల్సి వస్తోంది. పెట్రోలు మొదలు ఉప్పూ, పప్పూ సహా ధరలన్నీ పెరిగిపోయి కుటుంబాలు గుల్లవుతున్నాయి. మరి దళితులకు జగన్ చేసింది మేలా, కీడా.. అని గత ఎన్నికల్లో ఓట్లేసిన దళిత కుటుంబాలు చర్చించుకుంటున్నాయి.



చిల్లకూరులోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల వసతిగృహం గదుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, అపరిశుభ్రంగా తాగునీటి కుళాయిలు

వివక్ష.. అవమానం..



వైసీపీ సమావేశంలో కుర్చీ లేకుండా వెనుక నిలబడి వున్న సత్యవేడు అభ్యర్థి రాజేష్

వైసీపీలో దళితుల పట్ల వివక్ష అనేక సందర్భాల్లో వెల్లడవుతూనే ఉంది. ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా విలువలేని పదవుల్లోనే కొనసాగారు. అగ్రవర్ణ నేతలతో సమానంగా అధికారాన్ని ఒక్క దళిత ప్రజాప్రతినిధి కూడా అనుభవించలేదు. అనుభవించనివ్వలేదు. రెడ్డి సామాజికవర్గం ఎమ్మెల్యేల స్థానాల జోలికి ఎక్కడా వెళ్లని జగన్.. ఎస్సీ ఎమ్మెల్యేలతో మాత్రం ఆడుకున్నారు.

మీ బిడ్డలైతే ఇక్కడ చదువుతారా జగన్?

చదువుల గురించి జగన్ చెప్పుకునే గొప్పల అసలు రంగు సంక్షేమ హాస్టళ్ల నిర్వహణను పరిశీలిస్తే అర్థం అవుతుంది. దళిత బిడ్డలు చదువుకునే తావుల్లో కనీస వసతులు లేవు. నిర్లక్ష్యానికి సాక్ష్యంగా ఇవి దర్శనమిస్తున్నాయి.

● చిల్లకూరు మండల కేంద్రంలోని బీఆర్ అంబేడ్కర్ పేరిట వున్న గురుకుల వసతి గృహంలోని గదులు అధ్వానంగా వున్నాయి. విద్యార్థులకు ఉపయోగపడాల్సిన గదుల్లో చెత్తా చెదారం, పనికి రాని వస్తువులను నింపి డంపింగ్ యార్డులా తయారు చేశారు. తాగునీటి కొళాయి ఉన్న చోట పాచిపట్టిపోయి తీవ్ర అపరిశుభ్రత నెలకొనివుంది.



● తొట్టంబేడు మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. పునాదులు దెబ్బతిన్న వైనం భవనం వెలుపలి వైపే కళ్లకు కడుతోంది.



● బీఎన్ కండ్రిగ మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో తలుపులు, కిటికీలు అధ్వానంగా వున్నాయి. అన్నీ సగం విరిగిపోయి కనిపిస్తున్నాయి.



కాళ్లు పట్టుకున్నా ఆదిమూలాన్ని కనికరించలేదు!

సత్యవేడు వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఆధిపత్య కులానికి చెందిన బడా నేతలు చెప్పిందే అధికారంలో ఉన్న ఐదేళ్లూ చేశారు. అయినా టికెట్ లేదన్నారు. తిరుపతి ఎంపీగా పోటీ చేయమని ఆదేశించారు. కన్నీరు మున్నీరైన ఆయన తాను ఎలాంటి తప్పూ చేయలేదని, తనకు సత్యవేడులోనే పోటీ చేసే అవకాశం ఇవ్వాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాళ్లు పట్టుకున్నా కనికరించలేదు. ఆత్మాభిమానం దెబ్బతిన్న ఆదిమూలం ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరారు. దీంతో శ్రేణుల ద్వారా ఆయన దిష్టిబొమ్మలు తగులబెట్టించారు. టీడీపీ టికెట్‌తో ఇపుడు సత్యవేడు నుంచే ఆయన బరిలో దిగుతున్నారు.



సత్యవేడు టికెట్‌కోసం పెద్దిరెడ్డి కాళ్లు మొక్కుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

గెలిచినా టికెట్ దక్కని వరప్రసాద్

వైసీపీలో పదేళ్ల పాటు ప్రజాప్రతినిధిగా కొనసాగిన గూడూరు సిట్టింగ్ ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావుకు ఎమ్మెల్యే సీటు లేదని మొహం మీదే చెప్పేశారు. 2014లో తిరుపతి నుంచీ వైసీపీ ఎంపీగా గెలిచిన ఆయనకు 2019లో రెండోసారి ఎంపీగా అవకాశం ఇవ్వలేదు. గూడూరు అసెంబ్లీ స్థానం కేటాయించారు. అక్కడా గెలిచిన ఆయనకు ఇప్పుడు టికెట్ లేదన్నారు. దీంతో ఆయన బీజేపీలో చేరి తిరుపతి ఎంపీ అభ్యర్థిగా పోటీకి సిద్ధమవుతున్నారు.

గురుమూర్తితో బంతాట

అగ్రవర్ణ నాయకులతో అణిగిమణిగి వినయంగా వ్యవహరించే తిరుపతి ఎంపీ గురుమూర్తితోనూ బంతాట ఆడుకున్నారు. ఆయనకు సత్యవేడు కేటాయించారు. ఇష్టం లేకపోయినా సిద్ధపడి ప్రచారంలో దిగిన కొద్ది రోజులకే మళ్లీ తిరుపతి ఎంపీ టికెట్ కేటాయించారు.

జడ్పీటీసీ కుర్చీపై మూత్రం పోసిన వైసీపీ నేత



చిల్లకూరు మండల పరిషత్ కార్యాలయంలో వైసీపీ నేత మూత్రం పోసిన తన కుర్చీని పరిశీలిస్తున్న జడ్పీటీసీ మన్నెం శీనయ్య

చిల్లకూరు మండల పరిషత్ కార్యాలయంలో జడ్పీటీసీ మన్నెం శీనయ్యకు కేటాయించిన ఛాంబర్‌లో ఆయన కుర్చీపై అధికార పార్టీ నేత ఒకరు మూత్రం పోసిన ఘటన దళిత వర్గాలను కలచివేసింది. గతేడాది ఫిబ్రవరి 13న జడ్పీటీసీ మన్నెం శీనయ్య తన ఛాంబర్‌లోకి వెళ్లగా కుర్చీపై ఎవరో మూత్రం పోసినట్టు గుర్తించారు. కార్యాలయ సిబ్బందిని ఆరా తీయగా అంతకు మునుపు వైసీపీ నేత ఒకరు గది తాళాలు తీసుకుని తెరిచినట్టు గుర్తించారు. ఆ నేతదీ, జడ్పీటీసీదీ ఒకే గ్రామం. ఇరువురికీ నడుమ విభేదాలున్నాయి. దీంతో తన గ్రామానికే చెందిన వైసీపీ నేత ప్రవీణ్‌కుమార్ రెడ్డి తన కుర్చీపై మూత్రం పోశారంటూ జడ్పీటీసీ అదే రోజు తిరుపతికి వచ్చి కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. మరుసటి రోజు చిల్లకూరు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఈ ఉదంతం జిల్లావ్యాప్తంగా దళిత వర్గాలను తీవ్రంగా గాయపరిచింది.

కురింజలంలో పేదలభూమి స్వాహా

వరదయ్యపాలెం మండలం కురింజలం పంచాయతీ దరఖాస్తు సంతోషపురం కాలనీ పక్కన 3 ఎకరాల ప్రభుత్వ భూమి వుంది. తలారివెట్టు గ్రామానికి చెందిన శ్రీనివాసులు, భాస్కరయ్య, ఎన్టీయార్ నగర్‌కు చెందిన చెంగయ్య, సుబ్రమణ్యం అనే నలుగురు దళితులు ఈ భూములను సాగు చేసుకుంటున్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ అధికారులు ఈ భూములను 2002లో స్వాధీనం చేసుకున్నారు. చివరికి ఆ ప్రాంతానికి చెందిన అధికార పార్టీ నాయకుడొకరి కుటుంబీకుల పేరిట ఆ భూమి నమోదైంది. బాధిత దళితులు న్యాయం చేయండని అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.



వైసీపీ నేతలు కాజేసిన భూమిలో బాధిత దళితులు

పథకాలన్నీ అటకెక్కించేశారు

దళితుల సంక్షేమానికి ఉద్దేశించిన పథకాలు, కార్యక్రమాలన్నీ గత ఐదేళ్లుగా దాదాపుగా ఆగిపోయాయి. ఎస్సీ కార్పొరేషన్ పూర్తిగా నిర్వీర్యమైంది. గతంలో ఏటా జిల్లా వ్యాప్తంగా వేల మంది దళితులకు స్వయం ఉపాధి కోసం రుణ సాయం అందేది. భూమి కొనుగోలు పథకం కూడా అమల్లో వుండేది. అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా పథకం ద్వారా ప్రతిభావంతులైన దళిత విద్యార్థులకు విదేశాల్లో చదువుకునే అవకాశం వుండేది. పేద ఎస్సీ విద్యార్థులకు కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుకునేలా బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం వుండేది. గత టీడీపీ ప్రభుత్వం వీటిని సమర్థవంతంగా అమలు చేసింది. జగన్ అధికారంలోకి వచ్చాక ఈ పథకాలలో ఒక్కటి కూడా అమలు కావడం లేదు.

కడగుంటలో చేపలు పట్టనివ్వలేదు

బాలాయపల్లి మండలం కడగుంటలో వప్పుతొట్టి మస్తానయ్య అనే దళితుడు 2022లో గ్రామ చెరువును రూ.4.20 లక్షలకు వేలం పాటలో దక్కించుకున్నారు. అందులో చేపలు పెంచారు.అయితే చేపలు పట్టుకోనివ్వకుండా అదే గ్రామానికి చెందిన వైసీపీ నేతలు అడ్డుకున్నారు.

వాక్యంలో భూములు లాక్కున్నారు

వైసీపీలో దళితులకు ఒక న్యాయం. ఇతరులకు మరొక న్యాయం అనేందుకు నిదర్శనం బాలాయపల్లి మండలం వాక్యం గ్రామంలోని ఉదంతం. ఇక్కడ 15 ఎకరాల భూమి 2009 నుంచీ దళితుల అధీనంలో ఉంది. అప్పటి వైఎస్ ప్రభుత్వం దళితులకు పట్టాలు ఇవ్వాలని ప్రతిపాదించింది.ఎందుకో పెండింగ్‌లో ఉండిపోయింది.2022లో ఆ భూముల్లో దళితులు నిమ్మమొక్కలు నాటుకోగానే వైసీపీ నేతలు ఆగ్రహించారు. అధికారుల ద్వారా నాటిన మొక్కలు పీకించేసి, ప్రభుత్వ భూములని బోర్డు పెట్టించారు. ఏడాది గడిచేసరికి అదే భూములను వైసీపీ నేతలకు పట్టాలు ఇచ్చేశారు. ఇప్పుడు వారు ఎంచక్కా నిమ్మ మొక్కలు నాటుకున్నారు. దళితుల వేదన అరణ్య రోదనే అయింది.

నామినేషన్ ఉపసంహరణ

సూళ్ళూరుపేట మండలం ఆబాక పంచాయతీలో స్థానిక సంస్థల ఎన్నికలపుడు మండల టీడీపీ నేత పాకం వెంకటసుబ్బయ్య కోడలు ఎంపీటీసీ స్థానానికి నామినేషన్ వేశారు. అయితే అధికార పార్టీకి చెందిన అగ్రవర్ణ నేతల ఒత్తిడితో వెంకటసుబ్బయ్యను పోలీసులు స్టేషన్‌కు పిలిపించి నామినేషన్ విత్‌డ్రా చేసుకోవాలని వేధించారన్న ఆరోపణలు వచ్చాయి. గత్యంతరం లేక నామినేషన్ విత్‌డ్రా చేసుకున్నారు.

వడదెబ్బతో ఒకరి మృతి

వరదయ్యపాళెం, ఏప్రిల్ 13:వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరు పంచాయతీ నక్కలమిట్టకు చెందిన షికారీ మణికంఠ(38) వడదెబ్బతో మృతి చెందారు. శుక్రవారం పనుల నిమిత్తం బయటకు వెళ్లిన ఆయన వడదెబ్బకు గురై శ్రీకాళహస్తి ఆస్పత్రిలో చేరాడు.శనివారం మధ్యాహ్నం ఆస్పత్రిలోనే మృతి చెందాడు.9నెలల గర్భిణి అయిన భార్య , ఇద్దరు పిల్లలు మణికంఠ మృతితో అనాథలయ్యారు.

ఏకతాటిపైకి కూటమి పార్టీల నేతలు

పవన్ పర్యటనతో మారిన రాజకీయ పరిణామాలు

తిరుపతి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు ఊపిరిసలపనంత బిజీ షెడ్యూల్..మరోవైపు జ్వరంతో వచ్చిన నీరసం..అవన్నీ పక్కనపెట్టి కూటమి నేతలను ఏకతాటిపైకి తెచ్చేందుకు జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రత్యేక విమానంలో తిరుపతికి వచ్చారు.రెండు రోజుల పాటు గ్రాండ్ రిడ్జ్ హోటల్లో మకాం చేసి అసమ్మతులను చల్లార్చారు.పొత్తుల్లో సీట్లు కోల్పోయిన కూటమికి చెందిన సీనియర్ నాయకుల త్యాగాల గురించి ప్రస్తావించారు.రాష్ట్ర ప్రయోజనాల కోసం చంద్రబాబు,తాను చేస్తున్న పోరాటాలను వివరించారు. కష్టపడండి..మీ శ్రమ వృథా కానివ్వబోమని హామీ ఇచ్చారు.పవన్ నచ్చజెప్పిన తీరుతో కూటమినేతల్లో అసంతృప్తులు పటాపంచలయ్యాయి.ఒక్కో పార్టీ నాయకులతో దాదాపు గంటపాటు మాట్లాడిన తీరుకు నేతలంతా ఫిదా అయ్యారు. ఆదివారం నుంచి ప్రచారాన్ని ముమ్మరం చేస్తామని అసమ్మతి నేతలు చెప్పడంతో కథ సుఖాంతమైంది.టీడీపీ ఇంఛార్జి సుగుణమ్మ నేతృత్వంలో ఆదివారం 34వ డివిజన్లో ప్రచారం జరగనుంది. అదేవిధంగా జనసేన ఇంఛార్జి కిరణ్ రాయల్ పార్టీ కార్యకర్తలతో సోమవారం రామతులసీ కల్యాణమండపంలో సమావేశమై ప్రచారానికి కార్యోన్ముఖులు కానున్నారు.

తిరుపతిపైనే ఫోకస్ ఎందుకంటే?

2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ స్థాపించిన మెగాస్టార్ చిరంజీవిని పాలకొల్లు తిరస్కరిస్తే... తిరుపతి అక్కున చేర్చుకుంది.ఆ విధంగా తిరుపతి నియోజకవర్గం మెగా ఫ్యామిలీకి సెంటిమెంట్‌గా మారింది. ఈసారి ఎన్నికల్లో కూడా తిరుపతిలో పవన్ లేదా ఆయన సోదరుడు నాగబాబు పేరు వినిపించినా కుదర్లేదు. అయితే పొత్తుల్లో భాగంగా ఆ సీటు జనసేనకు దక్కడంతో తిరుపతి సీటుపై ఆశపెట్టుకున్న టీడీపీ నేతలు నైరాశ్యంలోకి వెళ్లారు. చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులకు సీటు కేటాయించడంతో నిరాశ కాస్త వ్యతిరేకంగా మారింది.టీడీపీ నేతలే కాకుండా జనసేన ఇంచార్జి కిరణ్ రాయల్ కూడా అలకపాన్పు ఎక్కారు.ఇలా అందరూ ఆరణికి వ్యతిరేకంగా మారడంతో వారిమధ్య సయోధ్య కుదిర్చేందుకు పవన్ రెండు రోజులపాటు తిరుపతిలో మకాం వేశారు. తిరుపతి సీటును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అసంతృప్తి చల్లార్చే ప్రయత్నాలు చేశారు. శుక్రవారం రాత్రి ఒంటిగంట వరకు టీడీపీ, జనసేన నాయకులతో భేటీ అయ్యారు.ఆరణి శ్రీనివాసులు విజయం కోసం అందరూ కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇంఛార్జి సుగుణమ్మ, జనసేన తిరుపతి ఇంఛార్జి కిరణ్ రాయల్‌తో వేర్వేరుగా భేటీ అయ్యారు. అప్పటివరకు అసంతృప్తులుగా వున్న వారి స్వరం మారింది. కూటమి అభ్యర్థి విజయం కోసం కలిసిపనిచేస్తామని స్పష్టం చేశారు.

శక్తిపీఠంలో శాస్త్రోక్తంగా వారాహి హోమం



రామచంద్రాపురం, ఏప్రిల్ 13: రాయలచెరువుకట్ట శక్తిపీఠంలో వసంత నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా శనివారం వారాహి హోమం నిర్వహించారు. మరకతశక్తి కాళీ అమ్మవారికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకారం చేశారు. ఉదయం 9 గంటలకు వారాహి హోమం ప్రారంభించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వర భారతిస్వామి, శక్తి పీఠాధిపతి రమ్యానంద భారతి పూర్ణాహుతితో హోమం ముగించారు. సాయంత్రం అమ్మవారి ఊంజల్‌సేవ అనంతరం దేవి వైభవం వివరించి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

చంద్రగిరి, ఏప్రిల్ 13: మండలంలోని ఐతేపల్లె, అగరాల, కొటాల, రామిరెడ్డిపల్లె, పుల్లయ్యగారిపల్లె గ్రామాల్లో శనివారం సీఐ రామయ్య, ఎస్‌ఐలు అనిత, రవీంద్రనాయక్‌లు ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ రామయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకొంటామన్నారు. కవాతులో చంద్రగిరి పోలీసులు, ప్రత్యేక బలగాలు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో కుంభాభిషేకం

పాకాల, ఏప్రిల్ 13: మొగరాల పంచాయతీ కృష్ణాపురంలో కొత్తగా నిర్మించిన వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం పూజలు ఘనంగా నిర్వహించారు. శాస్త్రోక్తంగా ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని తనయుడు పులివర్తి వినీల్ పాల్గొన్నారు.

కోడిపందెం రాయుళ్లపై కేసు నమోదు

పాకాల, ఏప్రిల్ 13: స్థానిక గాంధీనగర్ సమీపంలో కోడిపందేల స్థావరంపై శనివారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్సై మహేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది స్థావరం వద్దకు చేరుకోగానే పందేలు ఆడుతున్న పలువురు పారిపోయారు. నలుగురు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. విధులకు ఆటంకం కలిగించారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజగోపాల్ శనివారం తెలిపారు.

టీడీపీ పాలనలోనే బీసీల అభివృద్ధి



మాట్లాడుతున్న తిరుమలరెడ్డి

రామచంద్రాపురం, ఏప్రిల్ 13: తెలుగుదేశం పాలనలోనే బీసీల అభివృద్ధి జరిగిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి అన్నారు. రాయలచెరువుపేటలో శనివారం జయహో బీసీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి చిన్నబాబు మాట్లాడుతూ జగన్‌పాలనలో అన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేశారే కానీ కనీసం కుర్చీలు కూడా ఇవ్వలేదన్నారు. జగన్ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించారని ఆరోపించారు. జిల్లా నాయకులు జనార్దన్ చౌదరి, ఉమాపతి నాయుడు, నీలకంఠచౌదరి, హరిప్రసాద్, నరసింహారెడ్డి, జేడీ జగన్, ఢిల్లీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ అభ్యర్థులకే ఎమ్మార్పీఎస్ మద్దతు

చంద్రగిరి, ఏప్రిల్ 13: ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ఎమ్మార్పీఎస్ మద్దతు ఉంటుందని నాయకులు తెలిపారు. శనివారం చంద్రగిరిలో జరిగిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర , సీనియర్ నాయకుడు గోపి మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి భాగస్వాములైన టీడీపీ అధినేత చంద్రబాబు వర్గీకరణకు మద్దతు ఇచ్చారన్నారు. ఎన్డీఏ కూటమి ఏపీలో అధికారంలోకి వస్తే మాదిగలకు ప్రభుత్వంలో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం. పార్లమెంటులో బిల్లుకు మద్దతు ఇవ్వకపోగా, సుప్రీంకోర్టులో అడ్వకేట్‌ను కూడా నియమించ లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీకి మాదిగలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని, చిత్తూరు ఎంపీ అభ్యర్థి ప్రసాదరావులను గెలిపించాలని కోరారు.

నేడు జిల్లాలో వైఎస్ షర్మిల పర్యటన

● శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరుల్లో బహిరంగసభలు

తిరుపతి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నేడు జిల్లాలో పర్యటించనున్నారు.శ్రీకాళహస్తి, సత్యవేడు, నగరి నియోజకవర్గాల్లో జరిగే ఎన్నికల బహిరంగసభల్లో పాల్గొననున్నారు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం షర్మిల ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీకాళహస్తి చేరుకుంటారు. తొలుత అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారు. అనంతరం అక్కడ నుంచీ ర్యాలీగా బేరివారి మండపం చేరుకుంటారు. అక్కడ జరిగే బహిరంగసభలో పాల్గొంటారు. అనంతరం అక్కడ నుంచీ బయల్దేరి సత్యవేడు చేరుకుని సాయంత్రం 4 గంటలకు అక్కడి గాంధీ విగ్రహ కూడలిలో నిర్వహించే బహిరంగసభకు హాజరవుతారు. అటు తర్వాత రాత్రి 7.30 గంటలకు నగరి నియోజకవర్గం పుత్తూరు చేరుకుని బహిరంగసభలో పాల్గొంటారు. కాగా మరుసటి రోజైన 15వ తేదీ సోమవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని జీడీనెల్లూరు,పలమనేరు,పూతలపట్టుల్లో పర్యటించనున్నారు. 16వ తేదీ మంగళవారం పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లెలో పర్యటించి ఆయాచోట్ల జరిగే బహిరంగసభల్లో పాల్గొంటారు.

48 ఏళ్ల పురుషుడికి 38ఏళ్ల మహిళ గుండె

శ్రీ పద్మావతి హృదయాలయలో 14వ గుండె మార్పిడి ఆపరేషన్



కర్నూలు నుంచి తీసుకొచ్చిన గుండెను శ్రీ పద్మావతి హృదయాలయలోకి తీసుకు వెళుతున్న వైద్యులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 13: తాను చనిపోతూ మరో ముగ్గురి ప్రాణాలను కాపాడింది ఓ యువతి. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కృష్ణవేణి (38)కి ప్రమాదవశాత్తు తలకు బలమైన గాయం తగలడంతో కర్నూలు కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు.పరీక్షించిన వైద్యులు ఆమె బ్రెయిన్ డెడ్ అయినట్టు నిర్ధారించారు. అవయవ దానం చేయాలని వైద్యులు అభ్యర్థించగా ఆమె కుటుంబ సభ్యులు అంగీకరించారు.ఆమె కిడ్నీని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి, గుండెను, లివర్‌ను తిరుపతికి తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.తిరుపతికి హెలికాప్టర్‌లో తరలించిన గుండె, లివర్‌ను గ్రీన్ ఛానల్ ద్వారా ఆస్పత్రులకు చేర్చారు. మధ్యాహ్నం 12.30 గంటలకు గుండె శ్రీ పద్మావతి హృదయాలయానికి, లివర్ స్విమ్స్ ఆస్పత్రికి చేరుకున్నాయి.హృదయాలయ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథరెడ్డి ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాకు చెందిన బాబూరావు (48)కు ఆ గుండెను వైద్యులు సుమారు 7 గంటలపాటు శ్రమించి అమర్చారు.దీంతో హృదయాలయ ఆస్పత్రిలో వరుసగా 14వ గుండె మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా ముగిసినట్లైంది.స్విమ్స్‌కు చేర్చిన లివర్‌ను త్వరలో అవసరమైన పేషెంటుకు అమర్చనున్నారు.

రూ.30 లక్షలతో ఎన్‌సీసీ క్యాడెట్ల వసతి సముదాయం

రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మాణం



భూమిపూజ చేస్తున్న డాక్టర్ గల్లా రామచంద్ర నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 13 : రూ.30 లక్షలతో ఎన్‌సీసీ క్యాడెట్ల వసతి సముదాయ భవనం నిర్మించనున్నారు. అమరరాజా గ్రూప్ పరిధిలోని సీఎస్‌ఆర్ ఆర్మ్ - రాజన్న ఫౌండేషన్ సంయుక్తంగా ఈ భవన నిర్మాణ ప్రాజెక్టును చేపట్టాయి. ఇందుకు సంబంధించిన భూమిపూజ తిరుపతి ఎన్‌సీసీ నగర్‌లో శనివారం నిర్వహించారు. అమరరాజా గ్రూప్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ గల్లా రామచంద్ర నాయుడు భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ 2,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ భవనాన్ని నిర్మించనున్నట్టు చెప్పారు. 1963 నుంచి తిరుపతి ఎన్‌సీసీ గ్రూప్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్ల వసతి సముదాయ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. బెస్ట్ ఎన్‌సీసీ క్యాడెట్‌గా గుర్తింపు పొందిన శ్రీకాంత్‌ను గల్లా రామచంద్రనాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ ఏపీ, టీఎస్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వీఎం రెడ్డి, తిరుపతి ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ యోగేష్ దంగరకోటి పాల్గొన్నారు.

చంద్రగిరి

అమ్మవారి సేవలో దత్తాత్రేయ



తిరుచానూరు, ఏప్రిల్ 13: తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారిని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ శనివారం దర్శించుకున్నారు. ఆలయం వద్ద టీటీడీ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. దర్శనానంతరం గవర్నర్ బండారు దత్తాత్రేయకు వేదపండితులు వేదాశీర్వాదం చేశారు. అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుమల వరాహస్వామిని ఆయన దర్శించుకున్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుపై ఎన్నాళ్లీ తాత్సారం?



చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద అంబేడ్కర్ విగ్రహం

చంద్రగిరి, ఏప్రిల్ 13: రెండేళ్లవుతున్నా చంద్రగిరి క్లాక్ టవర్ వద్ద పూర్తి స్థాయిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయలేదని దళిత నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని రెండేళ్ల క్రితం స్థానిక క్లాక్ టవర్ వద్ద ఆ మహనీయుని విగ్రహాన్ని దళిత నాయకులు తాత్కాలికంగా పెట్టారు. ఇందుకు కలెక్టర్ అనుమతి ఉండాలంటూ అప్పట్లో అధికారులు, పోలీసులు అభ్యంతరం తెలిపారు. దీంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. తమకు ఉమ్మడి రాష్ట్రం ఉండగానే విగ్రహం ఏర్పాటుకు హైకోర్టు అనుమతి ఇచ్చిందని దళిత నేతలు స్పష్టం చేశారు. జాతీయ రహదారి కూడలి అయిన పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారిలో ఏర్పాటుకు అనుమతించిందన్నారు. కాంగ్రెస్ హయాంలో రాయలవారికోటలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహం, క్లాక్ టవర్ వద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నాటి మంత్రి గల్లా అరుణకుమారి, దివంగత ఎంపీ నేత డాక్టర్ ఎన్.శివప్రసాద్ నిర్ణయించారన్నారు. అయినా పంచాయతీ, రెవెన్యూ అధికారులు మాత్రం అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతి ఉండాల్సిందేననడంతో దళిత నాయకులు ఆగ్రహించారు. విగ్రహాన్ని తొలగించకుండా దళిత నాయకులు కాపలా ఉన్నారు. హైకోర్టు తీర్పును అధికారులు అమలు చేయలేదంటూ అంబేడ్కర్ ఆశయ పోరాట సమితి కోర్టుకు కూడా నివేదించింది. కాలక్రమేనా అధికారులెవరూ విగ్రహం జోలికి పోలేదు. అప్పటి నుంచి రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు తమ సమస్యలపై అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించడం, వినతులు ఇవ్వడం లాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే నాటి నుంచి నేటివరకూ విగ్రహాన్ని పూర్తి స్థాయిలో నిర్మించకపోవడంపై దళిత సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం దిమ్మె కూడా ఏర్పాటు చేయక పోవడం శోచనీయమంటున్నారు. అంబేడ్కరును గౌరవించే తీరు ఇదేనా అని ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు స్పందించాలని కోరుతున్నారు. .

దొంగ ఓట్ల విషయంలో అప్రమత్తంగా ఉండండి



బీజేపీ నేతలతో పవన్‌కల్యాణ్

● బీజేపీ నేతలతో పవన్

తిరుపతి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):దొంగ ఓట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని బీజేపీ నాయకులకు జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సూచించారు. శుక్రవారం రాత్రి టీడీపీ, జనసేన నాయకులతో భేటీ అయిన పవన్ కల్యాణ్ శనివారం ఉదయం బీజేపీ నాయకులతో సమావేశమయ్యారు. ఆరణి శ్రీనివాసులు విజయం కోసం అందరూ కలిసి పనిచేయాలని సూచించారు.తిరుపతి నియోజకవర్గంలో ఒక వ్యక్తి పేరుపై మూడునాలుగు ఓట్లు ఉండడంపై ఈ సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. తిరుపతి లోక్‌సభ ఎన్నికల్లో వైసీపీ చేసిన అక్రమాలను, దౌర్జన్యాలను ఈసారి సార్వత్రిక ఎన్నికల్లోనూ చేస్తుందని, దాన్ని మూడు పార్టీలూ సమర్థవంతంగా ఎదుర్కోవడంపై చర్చించారు. ఇప్పటికీ వేల కొద్దీ బోగస్ ఓట్లు తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్నాయనీ వాటిపై ఎన్నికల కమిషన్ దృష్టికి బీజేపీ, జనసేన పార్టీలు తీసుకువెళ్ళాయని పవన్ తెలిపారు. చంద్రబాబు , బీజేపీ జాతీయ నాయకులు అరుణ్ సింగ్, సిద్ధార్థనాథ్ సింగ్, రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తదితరులతో నిర్వహించిన చర్చల్లో బోగస్, దొంగ ఓట్లుపై చర్చ జరిగిందన్నారు. దీనిపై కచ్చితంగా కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి కూడా తీసుకువెళ్లాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. అదేవిధంగా బూత్ స్థాయిలో కూడా మూడు పార్టీల నాయకులు అప్రమత్తంగా వ్యవహరించి దొంగ ఓట్లను అడ్డుకోవడం అత్యవసరమన్నారు.ఎలక్షనీరింగ్ విషయంలో మూడు పార్టీల న్యాయవాదుల బృందాలు కలవాలన్నారు.

గంజాయివనం చేసిన నేతలను సాగనంపుదాం



పవన్‌తో కిరణ్‌రాయల్

తిరుపతి ప్రజలు వైసీపీ అరాచకాలతో ఎంతగా ఇబ్బంది పడుతున్నారో చెప్పిన బీజేపీ నాయకులు ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరగాలని ప్రజలు కోరుకొంటున్నారని చెప్పారు. తిరుపతిలో గంజాయి ముఠాలు పెట్రేగిపోతున్నాయని బీజేపీ అధికార ప్రతినిధి భానుప్రకాశ్ రెడ్డి ఈ సందర్భంగా ప్రస్తావించారు. తులసి వనం లాంటి తిరుపతిని గంజాయి వనం చేసేసిన వైసీపీని సాగనంపాల్సిన సమయం వచ్చేసిందని పవన్ చెప్పారు. 'కచ్చితంగా మూడు పార్టీలవాళ్లం కలసికట్టుగా పనిచేద్దాం. ఎప్పటికప్పుడు ఉన్నతస్థాయిలో నాయకులే కాకుండా నియోజకవర్గాల నాయకులు సమీక్షా, సమన్వయ సమావేశాలు నిర్వహించుకోవడం వల్ల మెరుగైన ఫలితాలు వస్తాయి' అని తెలిపారు. బీజేపీ నేతలు సామంచి శ్రీనివాస్, అజయ్ కుమార్, ముని సుబ్రహ్మణ్యం, వరప్రసాద్, కె. భాస్కర్, పెనుబాల చంద్ర, జల్లి మధుసూదన్, పొనగంటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి వెండిని అమ్మేసిన ఎమ్మెల్యే మధు...!

● ఆధారాలతో సహా బయట పెడతానన్న అనుచరుడు ● ప్రాణ రక్షణ కల్పించాలని ఎస్పీకి వినతి



హేమచంద్రారెడ్డి

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 13: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి భారీ అక్రమాలకు పాల్పడ్డారంటూ ఆయన అనుచరుడు హేమచంద్రారెడ్డి సంచలన ప్రకటన చేశారు. ఏకంగా ముక్కంటి ఆలయంలోని వెండిని బెంగళూరులో అన్ని సొమ్ము చేసుకోవడంతోపాటు... కరోనా సమయంలో మద్యం దుకాణాలను లూటీ చేసి బ్లాక్‌లో విక్రయించారని వెల్లడించారు... ప్రస్తుతం తాను పార్టీ మారుతున్న నేపథ్యంలో బెదిరింపులకు గురి చేస్తున్నారని వాపోయారు. తనకు ప్రాణ రక్షణ కల్పించాలని తిరుపతి ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వివరాలు ఆయన మాటల్లో... 'నా పేరు చంద్రశేఖర్ రెడ్డి.. శ్రీకాళహస్తికి చెందిన నేను 13 ఏళ్ల నుంచి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డికి అనుచరుడిగా ఉన్నా. వైసీపీ శ్రీకాళహస్తి మొదటి విద్యార్థి సంఘం నాయకుడిగా పనిచేశా. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే నన్ను ప్రభుత్వ మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా చేర్పించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెండిని ఎమ్మెల్యే సతీమణి, అత్త బెంగళూరులో అమ్మేశారు. వారి ముగ్గురి పథకం ప్రకారం నేనే బెంగళూరుకు తీసుకెళ్లి వెండిని భారతి అనే మహిళకు విక్రయించా. వెండి కొనుగోలు చేసిన మహిళ ఖాతా నుంచి నా బ్యాంకు ఖాతాకు రూ.10 లక్షల నగదు కూడా జమ చేశారు. ఆ తర్వాత 2020వ సంవత్సరం మార్చి నెలలో లాక్ డౌన్ సందర్భంగా మద్యం దుకాణాలు మూసేశారు. అదే అదునుగా ఎమ్మెల్యే రాత్రివేళ మద్యం దుకాణాల్లోని సరుకును నా చేత ఖాళీ చేయించారు. ఆ తర్వాత పదింతల అధిక ధరతో మద్యం బ్లాక్‌లో విక్రయించుకున్నారు.వ్యక్తిగత కారణాలతో రెండేళ్లుగా ఎమ్మెల్యేకి నేను దూరంగా ఉంటున్నా. ఎన్నికల సమయం సమీపించడంతో వేరే పార్టీలో చేరాలని భావించా. ఆ విషయం తెలుసుకున్నప్పటి నుంచి ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి నన్ను ప్రలోభాలకు గురి చేయడం ప్రారంభించారు. నేను లొంగకపోవడంతో ఇంటి వద్దకు మనుషులను పంపించడం, ఫోన్లు చేసి బెదిరించడం చేస్తున్నారు. అయినా నేను లోబడకపోవడంతో నా వ్యక్తిగత అవసరాల కోసం ఇతరుల దగ్గర పెట్టిన ఇంటి పత్రాలు, స్టాంప్ పేపర్లు, ఖాళీ చెక్కులను ఎమ్మెల్యే తెప్పించుకున్నారు. తనకు లొంగకపోతే వాటితో ఇబ్బంది పెడతానని బెదిరిస్తున్నారు. శ్రీకాళహస్తిలో తిరిగే పరిస్థితి కూడా లేకుండా భయాందోళనకు గురి చేస్తున్నారు. అందుకే రక్షణ కోసం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశా. నా దగ్గర మద్యం స్కాంకు సంబంధించి పక్కాగా ఆడియో రికార్డులన్నీ ఉన్నాయి. అలాగే ముక్కంటి ఆలయ వెండిని బెంగళూరులో అమ్మిన సందర్భంలో ఆడియో కాల్ రికార్డింగ్ లు, బ్యాంకులో నగదు జమ చేసిన ఆధారాలు పక్కాగా ఉన్నాయి. అన్నింటిని అధికారుల వద్ద బహిర్గతం చేస్తా. నాలాగే ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితులుగా ఉన్న వారు మరికొందరు బయటపడలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. త్వరలో వారు కూడా ఎమ్మెల్యే అరాచకాలను బహిర్గతం చేసే అవకాశం ఉంది.' అని హేమచంద్రారెడ్డి వివరించారు.

దొంగ ఓట్ల సూత్రధారులపై కేసులు నమోదు చేయండి

● ఏఎస్పీ వెంకట్రావుకు కూటమి నేతల వినతి



ఏఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న కూటమి నేతలు

తిరుపతి(నేరవిభాగం)/కలెక్టరేట్, ఏప్రిల్ 13 : తిరుపతిలో దొంగ ఓట్ల సృష్టికర్తలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు శనివారం తిరుపతి అదనపు ఎస్పీ వెంకట్రావును, డీఆర్వో పెంచలకిషోర్‌ను కోరారు. ఈ మేరకు వారికి వినతిపత్రం అందజేశారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ దొంగ ఓట్లు..కరెన్సీ నోట్లతో ఈ ఎన్నికల్లో గెలవాలని చూస్తే తగిన రీతిలో బుద్ధి చెబుతామన్నారు. తిరుపతిలో కొందరు అధికారులు అధికార పార్టీతో అంటకాగుతున్నారని, తీరు మార్చుకోకపోతే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఎపిక్ కార్డుల డౌన్‌లోడ్ కేసు నీరుగారుతోందని, దీనిపై ఎన్నికల కమిషన్ దృష్టి పెట్టాలని కోరారు. టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి నరసింహయాదవ్ మాట్లాడుతూ తిరుపతిలో దాదాపు 38,493 దొంగ ఓట్లు ఉన్నాయని, కూటమి నాయకులు ఇంటింటికీ తిరిగి 6వేల ఓట్లను గుర్తించి రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామన్నారు. జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ దొంగ ఓట్లు సృష్టించడంలో 80 శాతం వైసీపీ నాయకుల పాత్ర ఉందన్నారు. సూత్రధారులపై కేసులు నమోదు చేసి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కిరణ్‌రాయల్, సామంచి శ్రీనివాసులు, అజయ్‌కుమార్, జేఎంసీ శివ వారి వెంట ఉన్నారు.

మే 15 నుంచి ఇంటర్ దరఖాస్తుల జారీ

● 22 నుంచి జూలై ఒకటి వరకు రెండు దశల్లో ప్రవేశాలు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 13: 2024-25 సంవత్సరానికి సంబంధించి జూనియర్ ఇంటర్‌లో ప్రవేశ ప్రక్రియ మే 15వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు తిరుపతి ప్రాంతీయ విద్యామండలి పర్యవేక్షణాధికారి (ఆర్ఐఓ) జీవీ ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. మొదటి విడతగా మే 15 నుంచి దరఖాస్తులు విక్రయించనున్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను తక్షణం సమర్పించిన వారికి అదే నెల 22 నుంచే ప్రవేశాలు ప్రారంభించనున్నారు. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ జూన్ 1వ తేదీ కాగా అదే రోజునుంచి ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి. జూన్ 10 నుంచి జూలై ఒకటో తేదీ వరకు రెండో దశ అడ్మిషన్లు జరగనున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, అన్ ఎయిడెడ్ కళాశాలల యాజమాన్యాలు ఈ మేరకు మాత్రమే ప్రవేశాలు నిర్వహించాలని ఆర్ఐవో ఆదేశించారు. ముందుగా ప్రవేశాలు నిర్వహించే కళాశాలలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

భాషే జాతికి ప్రాణం : స.వెం రమేష్



స.వెం రమేష్‌ను సత్కరిస్తున్న సాకం నాగరాజు

తిరుపతి (కల్చరల్), ఏప్రిల్ 13 : మన పొరుగు రాష్ట్రాల వారు వారి మాతృభాషను ప్రేమిస్తున్నట్లు తెలుగువారు మాతృభాషను ప్రేమించడం లేదని ప్రముఖ ఉద్యమకారుడు, రచయిత స.వెం రమేష్ అన్నారు. శనివారం తెలుగుభాషోద్యమ సమితి 20వ వార్షికోత్సవం తిరుపతిలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రమేష్ మాట్లాడుతూ దూరదేశాలలో తెలుగు పరిరక్షణ కోసం అక్కడి తెలుగువారు పరితపిస్తూ ఉంటే, రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలుగుబడులు కూడా మూతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మలేషియాకు చెందిన వెలగఅప్పలనాయుడు మాట్లాడుతూ బ్రిటీషు కాలంలో కార్మికులుగా మలేషియా వెళ్లిన తెలుగువారు అక్కడ తమ మాతృభాషను కాపాడుకుంటున్నారని, అయితే తెలుగు రాష్ట్రాల నుంచి తమకు ఎటువంటి మద్దతూ లేదని అన్నారు. కాగా 20 సంవత్సరాలుగా తెలుగు భాషాభివృద్ధికి తమ సమితి ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని, నిరసనలు, దీక్షలు, ధర్నాలు, ఉద్యమాలతో పోరాటం కొనసాగించామని సమితి అధ్యక్ష, కార్యదర్శులు గంగవరపు శ్రీదేవి, టెంకాయల దామోదరం సభకు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎంపిక

వ్యవస్థాపకులు డాక్టర్ సాకం నాగరాజు పర్యవేక్షణలో తెలుగు భాషోద్యమ సమితి నూతన కార్యవర్గ ఎంపిక శనివారం ఏకగ్రీవంగా జరిగింది. గౌరవాధ్యక్షుడిగా గంగవరపు శ్రీదేవి, అధ్యక్షుడిగా తమటం రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆకుల మల్లేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శిగా జే.రమేష్ బాబు, ఉపాధ్యక్షురాలిగా వి.కృష్ణవేణి, కార్యదర్శిగా పేరూరు బాలసుబ్రమణ్యం, కార్యవర్గ సభ్యులుగా మరో తొమ్మిది మంది ఎంపికయ్యారు.

వైసీపీ పాలనలో యువతకు తీవ్ర అన్యాయం



పద్మావతిపురంలో ఇంటింటా ప్రచారంలో పులివర్తి వినీల్

తిరుచానూరు, ఏప్రిల్ 13: వైసీపీ పాలనలో యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని తనయుడు వినీల్ అన్నారు. శనివారం ఆయన మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు షూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా తిరుపతి రూరల్ మండలం, పద్మావతిపురం పంచాయతీలో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలను గురించి వివరించారు. అనంతరం వినీల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్ లేక, కొత్త పరిశ్రమలు రాక, స్వయం ఉపాధికి ప్రభుత్వం నుంచి సహకారం అందక యువత భవిత ప్రశ్నార్థకంగా మారిందన్నారు. టీడీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, అమిలినేని మధు, సుబ్రహ్మణ్యం నాయుడు, వాణి గౌడ్, మహేశ్వరి, గోపి పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న బండారు దత్తాత్రేయ

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టతతోనే వికసిత్ భారత్ సాధ్యం

● హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 13 : గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠమైతేనే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించగలమని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అభిప్రాయపడ్డారు. 'ఎంపవరింగ్ రూరల్ ఇండియా ఎకానమీ ద రోల్ ఆఫ్ ఎన్‌ఆర్ఐస్ అంశంపై ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ - అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ సంయుక్తంగా తిరుపతిలో శనివారం సదస్సు నిర్వహించాయి. పద్మావతి మహిళా యూనివర్సిటీలోని సావేరీ సెమినార్ హాల్లో ఈ కార్యక్రమాన్ని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విదేశాలకు వెళ్లిన వారు స్వదేశానికి వచ్చి సేవ చేయడం అభినందనీయమన్నారు. ఎన్‌ఆర్ఐలు మరింత తోడ్పాటు అందించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్య, వైద్య, రవాణా వంటి మౌలిక రంగాల అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. దేశంలోని అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తుండటం శుభ సూచికమన్నారు. రక్షణ రంగంలోనూ మహిళల ప్రాతినిధ్యం పెరగడం గర్వకారణమని అన్నారు. చదువుతో పాటు విద్యార్థినులు ఆత్మ రక్షణ విద్య నేర్చుకోవాలన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి మాట్లాడుతూ మహిళ విద్య ద్వారా సమాజంలో మార్పు సాధ్యమవుతుందన్నారు. యూనివర్సిటీలో చదువుకున్న విద్యార్థినులు విదేశాల్లోనూ రాణిస్తున్నారని తెలిపారు.ఐసీఎంఏఐ తిరుపతి ఛాప్టర్ ఛైర్మన్ డాక్టర్ పార్థసారథి, అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యులు రాజబ్రహ్మం, సింగపూర్ తెలుగు సమాజం మాజీ కార్యదర్శి హరీష్ రాయల్, ఎస్‌బీఆర్ గ్రూప్స్ ఛైర్మన్ వేణుగోపాల్,స్మార్ట్‌స్టెప్స్ కో-ఫౌండర్ లావణ్య కుమార్,వడ్లమూడి గుర్రప్ప నాయుడు, కె.పూర్ణచంద్రరావు, షేక్ మస్తక్, చైతన్యకుమార్‌రెడ్డి, రాధారాణి పాల్గొన్నారు.


అయోధ్యకు టీటీడీ అధికారుల బృందం

భక్తులకు సౌకర్యాల కల్పనపై నివేదిక సమర్పణ

తిరుమల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామాలయంలో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, చేపట్టాల్సిన నిర్మాణాలు, క్యూల నిర్వహణ వంటి సాంకేతిక సలహాలతో కూడిన అంశాలపై టీటీడీ అధికారుల బృందం శనివారం నివేదిక సమర్పించింది. శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమలకు రోజూ వేలాది మంది భక్తులు వస్తున్న విషయం తెలిసిందే. సౌకర్యాల కల్పనతోపాటు క్యూల నిర్వహణ, అభివృద్ధి పనుల్లో టీటీడీ చురుగ్గా ఉంటోంది. అయోధ్య రామాలయంలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ తర్వాత దర్శనాలను కూడా ప్రారంభించిన విషయం తెలిసిందే. రోజురోజుకూ భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించింది. టీటీడీ సహకారాన్ని కోరింది. ఫిబ్రవరిలో టీటీడీ ఈవో ధర్మారెడ్డి సహా పలువురు అధికారులు నేరుగా వెళ్లి ఆయా ప్రదేశాలను, వస్తున్న రద్దీ, చేపట్టాల్సిన చర్యలపై అధ్యయనం చేశారు. నివేదిక సిద్ధం చేసి ఈవో ధర్మారెడ్డి, టీటీడీ ఇంజినీరింగ్ విభాగం సలహాదారు రామచంద్రారెడ్డి, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు శనివారం అయోధ్యలో దాన్ని సమర్పించారు. ఆదివారం రాముని దర్శనం చేసుకుని మరోసారి ట్రస్టు సభ్యులతో సమావేశం కానున్నారు.

చెవిరెడ్డి ఒత్తిళ్లకు తలొగ్గి రాజీనామా చేయొద్దు

● వలంటీర్లకు సుధారెడ్డి హితవు



తిరుచానూరు, ఏప్రిల్ 13: వలంటీర్ల ద్వారా ఓటర్లను బెదిరించో,బుజ్జగించో ఓట్లు వేయించుకోవాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి ప్రయత్నిస్తున్నారని నియోజకవర్గ టీడీపీ మహిళా నేత పులివర్తి సుధారెడ్డి విమర్శించారు. శనివారం తిరుపతి రూరల్ మండలం రఘునాథ్ రిసార్ట్స్‌లోని నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. రాజీనామా చేయాలని వలంటీర్లపై చెవిరెడ్డి కుటుంబ సభ్యులు ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. వలంటీర్లను బలిపశువులు చేస్తున్నారన్నారు. రెండు నెలలు మాత్రమే ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఎన్నికల కమిషన్ చెప్పిందని గుర్తించాలన్నారు. చెవిరెడ్డి కుటుంబ సభ్యులు మాటలు విని రాజీనామా చేయవద్దని ఆమె వలంటీర్లకు హితవు పలికారు. భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే రూ.10వేలు జీతంతో పాటు గౌరవం ఇస్తుందని భరోసా ఇచ్చారు.

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో భారత ఆర్మీ లెఫ్టినెంట్ జనరల్ ఏకే సింగ్, తెలంగాణ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వెంకటరమణారెడ్డి ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఘనంగా లిటిల్ ఏంజెల్స్ స్కూల్ వార్షికోత్సవం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జమున, రమాదేవి, రాజగోపాల్‌రెడ్డి

తిరుపతి(విద్య), ఏప్రిల్ 13: లిటిల్ ఏంజెల్స్ స్కూల్ 43వ వార్షికోత్సవాన్ని శనివారం మహతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన పద్మావతి మహిళా వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ డి.జమునతో కలసి కళాశాల కరస్పాండెంట్ కె.రాజగోపాల్‌రెడ్డి, చైర్‌పర్సన్ ఎం.రమాదేవి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. జమున మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు దేశభక్తి, దైవభక్తి పెంచుకోవాలన్నారు. డైరెక్టర్లు కేఆర్ శ్వేత, సి.అరవింద్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రతిరోజూ పిల్లలతో కొంత సమయం గడిపి సమాజంలోని మంచి, చెడులపై అవగాహన కల్పించి వారి ఉన్నతికి పాటుపడాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ అంశాలలో ప్రతిభచాటిన వారికి సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు.

గీతం విద్యార్థుల విజయం


చరిత, హిమజ, అక్షరసాయి

తిరుపతి(విద్య), ఏప్రిల్ 13: భవానీనగర్‌లోని గీతం జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్‌లో మంచి మార్కులు సాధించి విజయ కేతనం ఎగురవేశారని గీతం విద్యాసంస్థల అధినేత తమ్మినేని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జూనియర్ ఎంపీసీలో 30 మంది విద్యార్థులు 463 నుంచి 400 వరకు మార్కులు సాధించారని, బైపీసీలో 428 నుంచి 418 మార్కుల మధ్య 9 మందికి, సీఈసీలో 487, 460తోపాటు 15 మంది 450కి పైగా మార్కులు సాధించారని వెల్లడించారు. సీనియర్ ఎంపీసీలో 987, 984, 981, 973 మార్కులు, బైపీసీలో 981, 974, 973, 971 మార్కులు సాధించినట్లు ప్రకటించారు. వారిని ఆయనతోపాటు కళాశాల ప్రిన్సిపాల్ టీవీ గోపీనాథ్ అభినందించారు.

అభినయ్‌ను అనర్హుడిగా ప్రకటించాలి


శంకర్

తిరుపతి అర్బన్,ఏప్రిల్13:వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అభినయ్‌రెడ్డిని అనర్హుడిగా ప్రకటించాలని స్వతంత్ర అభ్యర్థి రంగున్ శంకర్ డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్‌గా కొనసాగుతూనేఎన్నికల ప్రచారం చేస్తున్నా ఎలక్షన్ కమిషన్ స్పందించకపోవడం సరికాదన్నారు.ఇది కార్పొరేషన్‌పరిధిలో ఉండే ఉద్యోగులను ప్రభావితం చేసినట్లు కాదా అని ప్రశ్నించారు. ఆయన తండ్రి భూమన కరుణాకరరెడ్డి టీటీడీ చైర్మన్ పదవిలో ఉంటూనే ప్రచారంలో పాల్గొంటూ టీటీడీ ఉద్యోగులను ప్రభావితం చేస్తున్నారని తెలిపారు.తెలిసోతెలియకో చిరు ఉద్యోగులు ప్రచారంలో పాల్గొంటే తక్షణ చర్యలు తీసుకునే ఎన్నికల కమిషన్ దీనిపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. విద్యావంతుడిగా, యువకుడిగా ప్రజల ముందుకు వస్తున్నానని, తనను గెలిపించాలని కోరారు.

'పుష్ప2' కోసం నేనూ వెయిటింగ్
సినీ నటి దివి



తిరుమల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అల్లు అర్జున్, సుకుమార్ కాంబినేషన్‌లో రాబోతున్న పుష్ప2 సినిమా కోసం నేను కూడా ఎదురుచూస్తున్నానని ఆచిత్రంలో నటించిన దివి అన్నారు. శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం నందమూరి బాలకృష్ణ సినిమాలో, హరికథ వెబ్ సిరీస్‌లో నటిస్తున్నట్టు తెలిపారు. ఇటీవల ఓటీటీలో విడుదలైన లంబసింగి చిత్రం విజయవంతమైందని, అందుకే స్వామికి కృతజ్ఞతలు చెప్పేందుకు వచ్చానని చెప్పారు. కాగా, ఆలయం ముందు దివిని చూసేందుకు అభిమానులు పోటీపడ్డారు. సెల్ఫీలు తీసుకున్నారు.

జనసేనలోకి పాలకల మల్లి
పవన్ సమక్షంలో పలువురి చేరిక


జనసేన కండువా కప్పుకున్న పాలకల మల్లికార్జున్

తిరుపతి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ తిరుపతి నగర మాజీ అధ్యక్షుడు పాలకల మల్లికార్జున్ జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సమక్షంలో శనివారం ఆ పార్టీలో చేరారు. ఆయన గతంలో తిరుపతి పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో పనిచేసి, ఆయన గెలుపులో కీలకపాత్ర పోషించారు. పీఆర్పీని కాంగ్రెస్‌లో విలీనం చేసిన తర్వాత ఇతను కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు. జీవకోన ప్రాంతంలో గట్టి పట్టున్న పాలకల పార్టీలో చేరడం కీలకపరిణామంగా మారింది. అదేవిధంగా ధర్మవరం పట్టణానికి చెందిన ఎగ్జిబిటర్ భాస్కర్‌తోపాటు రాయలసీమ జిల్లాలకు చెందిన పలువురు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. చిత్తూరు లోక్‌సభ స్థానం నుంచి కూటమి తరపున పోటీ చేసున్న తెలుగుదేశం అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు మర్యాదపూర్వకంగా కలిశారు.

అలరించిన నగర సంకీర్తన



తిరుపతి (కల్చరల్), ఏప్రిల్ 13: నగరంలో శనివారం ఉదయం రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 5నుంచి 7 గంటల వరకు గోవిందరాజ స్వామి ఆలయ మాడవీధులలో సంకీర్తన చేశారు. సంస్థ అధ్యక్షుడు గోపినాథరెడ్డి మాట్లాడుతూ నగర ప్రజలలో భక్తిభావం పెంపొందించడం కోసం పురాతన సంప్రదాయం కొనసాగిస్తున్నామని తెలిపారు.

ఎస్వీ పాలిటెక్నిక్‌కు పూర్వ విద్యార్థి విరాళం



తిరుపతి(విద్య), ఏప్రిల్ 13: తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు 1983లో డిప్లొమా(సివిల్) కోర్సు చదివిన పూర్వ విద్యార్థి, ఎన్నారై వై.సురేష్‌బాబు రూ.1,01,116 విరాళంగా అందజేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఈ మేరకు చెక్కును తల్లి వై.గోవిందమ్మ చేతుల మీదుగా శనివారం కళాశాల జనరల్ విభాగం హెడ్ డాక్టర్ ఎస్వీగౌరీశంకర్‌కి అందజేసినట్లు చెప్పారు. సురేష్‌బాబు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు.

డాక్టరేట్ ప్రదానం


మునిశేఖర్

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 13 : నగరానికి చెందిన పి.మునిశేఖర్‌కు డాక్టరేట్ లభించింది. అనంతపురం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో 'పెర్ఫార్మెన్స్ ఇంప్రూవ్‌మెంట్ ఆఫ్ రేడియల్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ బై ప్లేసింగ్ ఆప్టిమల్ డీజీ అండ్ ఈఎస్ఎస్ యూసింగ్ హివ్‌రెస్టిక్ అల్గోరిథమ్స్ అండ్ ఇవల్యూషన్ ఆఫ్ ఎకనామిక్ లోడ్ డిస్పాచ్' అనే అంశంపై డాక్టర్ జి.జయకృష్ణ, డాక్టర్ ఎస్.వైశాలి పర్యవేక్షణలో పరిశోధన పత్రం సమర్పించారు. ఆయన్ను పలువురు అభినందించారు.

శాస్త్రోక్తంగా చక్రస్నానం
ముగిసిన కోదండరాముడి బ్రహ్మోత్సవాలు



తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 13: కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం కపిలతీర్థంలోని పుష్కరిణిలో చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు సీతాలక్ష్మణ సమేత సీతారాములు పల్లకిలో కపిలతీర్థం చేరుకున్నారు. 9 నుంచి 10.30 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వేణుగోపాలస్వామి ఆలయంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం అర్చకులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ మూర్తులను గోవిందరాజస్వామి ఉన్నతపాఠశాల ఆవరణలోని పీఆర్ తోటకు వేంచేపు చేయించారు. అక్కడ విశ్రాంతి అనంతరం సాయంత్రం తీర్థకట్ట వీధి, కోటకొమ్మలవీధి, కొత్తవీధి మీదుగా ఆలయానికి చేరుకున్నారు. మార్గంలో వైఖానసాచార్య, ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆస్థానం నిర్వహించారు. రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు ఆలయంలో ధ్వజావరోహణం నిర్వహించారు. దీంతో కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్, చిన్నజీయర్ స్వాములు, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ప్రధాన అర్చకులు ఆనందకుమార్ దీక్షితులు, కంకణ బట్టార్ సీతారామాచార్యులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో, రామచంద్ర పుష్కరిణి వేదిక వద్ద నిర్వహించిన సంగీత కార్యక్రమాలు అలరించాయి.

ఘనంగా వేదవిజ్ఞాన పీఠాల స్నాతకోత్సవం


స్నాతకోత్సవ పట్టాలు అందజేస్తున్న టీటీడీ డీఈవో, వీసీ

తిరుపతి రూరల్, ఏప్రిల్13 : తిరుపతిలోని ఎస్వీ వేదవర్సిటీకి అనుబంధంగా నడిచే ధర్మగిరి, నల్లగొండ వేదవిజ్ఞానపీఠాల స్నాతకోత్సవం శనివారం ఆ వర్సిటీలో ఘనంగా నిర్వహించారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాణీసదాశివమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా వచ్చిన టీటీడీ విద్యాశాఖాధికారి డాక్టర్ భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ బ్రహ్మశ్రీ కుప్పా శివసుబ్రహ్మణ్య అవధాని, డాక్టర్ వేణుగోపాల్‌తో కలసి.. ధర్మగిరి పాఠశాలకు చెందిన 55మంది విద్యార్థులకు, నల్లగొండ పాఠశాలకు చెందిన 19మంది విద్యార్థులకు స్నాతకోత్సవ పట్టాలను ప్రదానం చేశారు. భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ వేదవిద్యవ్యాప్తికి టీటీడీ విశేషంగా కృషి చేస్తోందని తెలిపారు. వీసీ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో వేదవిద్యను పూర్తిచేసిన విద్యార్థులు తమ ఉన్నత విద్యను తిరుపతిలోని వేదవర్సిటీలో అభ్యసించాలని సూచించారు. ధర్మగిరి వేదపాఠశాల ప్రిన్సిపాల్ కుప్పా శివసుబ్రహ్మణ్య అవధాని మాట్లాడుతూ 140 సంవత్సరాల క్రితం ఏర్పాటైన పాఠశాల ఇప్పటికే 129 స్నాతకోత్సవాలను పూర్తి చేసుకుందని, ఇక్కడ చదివిన ఎందరో విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని వివరించారు. నల్లగొండ వేదపాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ 2013లో వేదవిజ్ఞానపీఠాన్ని ఏర్పాటు చేశారని, రెండవ స్నాతకోత్సవాన్ని జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రాధాగోవింద త్రిపాఠి, అకడమిక్ డీన్ గోలిసుబ్రహ్మణ్య శర్మ, డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ గంజాం రామకృష్ణ, పీఆర్వో డాక్టర్ టి.బ్రహ్మాచార్యులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి
సహాయం కోసం 1930కు ఫోన్ చేయండి : సీఐడీ సీఐ రామ్‌కిషోర్

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 13 : సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, వాటిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐడీ సీఐ రామకిషోర్ సూచించారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్, అర్బన్ హట్, జనసందడి ఉన్న కూడళ్లలో శనివారం తిరుపతి సీఐడీ పోలీసు శాఖ రీజనల్ అధికారి పద్మలత ఆధ్వర్యంలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ఎవరైనా సైబర్ నేరాల బారినపడితే 1930కు ఫోన్ చేసి, సమాచారమివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఓఎల్‌ఎక్స్, లోన్ యాప్‌ల ద్వారా జరిగే నేరాల గురించి వివరించారు. 1930కు ఎలా కాల్ చేయాలి..మొబైల్ వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి..అనే విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐడీ ఎస్ఐ పకృద్దీన్ పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.99 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.99 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ప్రకటించింది. ఇక, శుక్రవారం 63,163 మంది శ్రీవారిని దర్శించుకున్నారు.

'భూమన' గుప్పెట్లో నుంచి తిరుపతికి విముక్తి కల్పిద్దాం
స్వచ్ఛమైన పాలన కోసం జనసేనకు ఓటెయ్యండి
ప్రచార జోరు పెంచిన ఆరణి శ్రీనివాసులు


ఆరణి శ్రీనివాసులుకు హారతులు పడుతున్న మహిళలు

తిరుపతి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : భూమన కరుణకరరెడ్డి కుటుంబ కబంధ హస్తాలలో చిక్కుకున్న తిరుపతికి విముక్తి కల్పిద్దామని, స్వచ్ఛమైన పాలన కోసం జనసేనకు ఓటువేయాలని టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు అభ్యర్థించారు. ఎమ్మెల్యేగా, టీటీడీ చైర్మన్‌గా కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్‌గా అభినయ్ రెడ్డి ఇష్టారాజ్యంగా అధికారం చెలాయిస్తున్నారని విమర్శించారు. ఇది సరిపోదు అన్నట్లు కరుణాకరరెడ్డి సోదరుడు భూమన్‌కు శ్వేతా డైరెక్టర్ పదవి కట్టబెట్టారని అన్నారు. శనివారం 38, 39, 40, 41 డివిజన్లలో ఎండను సైతం లెక్క చేయకుండా ఆరణి ప్రచారం నిర్వహించారు. అధికారాన్ని చేతుల్లోకి తీసుకున్న భూమన నగరంలో చేయని అక్రమమంటూ లేదని ఆరోపించారు. ఆయన నిరంకుశ వైఖరిని ఐదేళ్లుగా భరించిన ప్రజలు నెల రోజుల్లో తగిన బుద్ధి చెప్పబోతున్నారని జోస్యం చెప్పారు. కపిలతీర్థం రోడ్డులో జరిగిన ప్రచారంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ పాల్గొన్నారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పుష్పావతి యాదవ్ నేతృత్వంలో జరిగిన ప్రచారంలో మహిళలు హారతులు ఇస్తూ ఘన స్వాగతం పలికారు. సింగాలగుంట వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. వైసీపీ నుంచి పలువురు యువకులు జనసేనలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నరసింహ యాదవ్, మందలపు మోహన్‌రావు, చినబాబు, రుద్ర కోటి సదాశివం, సూర్యకుమారి, నిరంజన్ నాయుడు, కేవీ రమణతోపాటు బీజేపీ నాయకులు జనార్దన్ రెడ్డి, మోహన్, రుద్ర, ప్రసాద్, నాగరాజు, జనసేన నాయకురాలు వినుత, కీర్తన, చంద్రబాబు, అనంద్, చందు, దిలీప్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పవన్ కల్యాణ్ అభిమానిని అభినందిస్తున్న ఆరణి

బీజేపీతోనే దేశాభివృద్ధి: వరప్రసాద్


రోడ్ షోలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వరప్రసాద్, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(ఉపాధ్యాయ నగర్), ఏప్రిల్ 13: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. శనివారం సాయంత్రం ఆయన తిరుపతి నగరంలోని మున్సిపల్ పార్కుకు వెళ్లి అక్కడ వాకింగ్ చేస్తున్న యువకులతో మాట్లాడారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధిని వారికి వివరించారు. అక్కడ నుంచి టీ దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వద్దకెళ్లి స్థానికులతో మాట్లాడారు. బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం కేటీ రోడ్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులతో కలిసి వరప్రసాదరావు రోడ్ షో ద్వారా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు యుగంధర్, దామోదర్, మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే తిరుపతిలోని టెంపుల్ టౌన్ కాలనీలో ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు సతీమణి కొల్లూరి లక్ష్మి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె కాలనీవాసులతో మాట్లాడుతూ వరప్రసాదరావు తిరుపతి ఎంపీగా పనిచేసిన ఐదేళ్ల కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారని అన్నారు. అటువంటి వ్యక్తికి వైసీపీలో ఎన్నో అవమానాలు ఎదురయ్యాయని, సహించలేక ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారని చెప్పారు. తిరుపతి పార్లమెంటు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు. కమలం గుర్తుపై ఓటేసి ఎంపీగా వరప్రసాదరావును, గాజు గ్లాసు గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా ఆరణి శ్రీనివాసులును గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.


టెంపుల్‌టౌన్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న కొల్లూరి లక్ష్మి

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టతతోనే
వికసిత్ భారత్ సాధ్యం
హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



సదస్సులో మాట్లాడుతున్న బండారు దత్తాత్రేయ

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 13: గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టమైతేనే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించగలమని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అభిప్రాయపడ్డారు. 'ఎంపవరింగ్ రూరల్ ఇండియా ఎకానమీ ద రోల్ ఆఫ్ ఎన్ఆర్ఐస్ అంశంపై ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ - అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ సంయుక్తంగా తిరుపతిలో శనివారం సదస్సు నిర్వహించాయి. పద్మావతి మహిళా యూనివర్సిటీలోని సావేరీ సెమినార్ హాల్లో ఈ కార్యక్రమాన్ని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విదేశాలకు వెళ్లిన వారు స్వదేశానికి వచ్చి సేవ చేయడం అభినందనీయమన్నారు. ఎన్ఆర్ఐలు మరింత తోడ్పాటు అందించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్య, వైద్య, రవాణా వంటి మౌలిక రంగాల అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. దేశంలోని అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తుండటం శుభ సూచికమన్నారు. రక్షణ రంగంలోనూ మహిళల ప్రాతినిధ్యం పెరగడం గర్వకారణమని అన్నారు. చదువుతో పాటు విద్యార్థినులు ఆత్మ రక్షణ విద్య నేర్చుకోవాలన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి మాట్లాడుతూ విద్య ద్వారా సమాజంలో మార్పు సాధ్యమవుతుందన్నారు. మహిళలు విద్యావంతులైతే కుటుంబం, సమాజం విద్యావంతం కావడానికి అవకాశం ఉందన్నారు. యూనివర్సిటీలో చదువుకున్న విద్యార్థినులు విదేశాల్లోనూ రాణిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీఎంఏఐ తిరుపతి చాప్టర్ చైర్మన్ డాక్టర్ పార్థసారథి, అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యులు రాజబ్రహ్మం, సింగపూర్ తెలుగు సమాజం మాజీ కార్యదర్శి హరీష్ రాయల్, ఎస్‌బీఆర్ గ్రూప్స్ చైర్మన్ వేణుగోపాల్, స్మార్ట్‌స్టెప్స్ కో-ఫౌండర్ లావణ్య కుమార్, వడ్లమూడి గుర్రప్ప నాయుడు, కె.పూర్ణచంద్రరావు, షేక్ మస్తక్, చైతన్యకుమార్‌రెడ్డి, రాధారాణి పాల్గొన్నారు.

నేడు జిల్లాలో వైఎస్ షర్మిల పర్యటన
శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరుల్లో బహిరంగసభలు

తిరుపతి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నేడు జిల్లాలో పర్యటించనున్నారు.శ్రీకాళహస్తి, సత్యవేడు, నగరి నియోజకవర్గాల్లో జరిగే ఎన్నికల బహిరంగసభల్లో పాల్గొననున్నారు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం షర్మిల ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీకాళహస్తి చేరుకుంటారు. తొలుత అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారు. అనంతరం అక్కడ నుంచీ ర్యాలీగా బేరివారి మండపం చేరుకుంటారు. అక్కడ జరిగే బహిరంగసభలో పాల్గొంటారు. అనంతరం అక్కడ నుంచీ బయల్దేరి సత్యవేడు చేరుకుని సాయంత్రం 4 గంటలకు అక్కడి గాంధీ విగ్రహ కూడలిలో నిర్వహించే బహిరంగసభకు హాజరవుతారు. అటు తర్వాత రాత్రి 7.30 గంటలకు నగరి నియోజకవర్గం పుత్తూరు చేరుకుని బహిరంగసభలో పాల్గొంటారు. కాగా మరుసటి రోజైన 15వ తేదీ సోమవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని జీడీనెల్లూరు, పలమనేరు, పూతలపట్టుల్లో పర్యటించనున్నారు. 16వ తేదీ మంగళవారం పీలేరు, మదనపల్లె, తంబళ్ళపల్లెలో పర్యటించి ఆయాచోట్ల జరిగే బహిరంగసభల్లో పాల్గొంటారు.

48 ఏళ్ల పురుషుడికి 38ఏళ్ల మహిళ గుండె
పద్మావతి హృదయాలయలో 14వ గుండె మార్పిడి ఆపరేషన్



కర్నూలు నుంచి తీసుకొచ్చిన గుండెను పద్మావతి హృదయాలయలోకి తీసుకు వెళుతున్న వైద్యులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 13: తాను చనిపోతూ మరో ముగ్గురి ప్రాణాలను కాపాడింది ఓ మహిళ. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కృష్ణవేణి(38)కి ప్రమాదవశాత్తు తలకు బలమైన గాయం తగలడంతో కర్నూలు కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు ఆమె బ్రెయిన్ డెడ్ అయినట్టు నిర్ధారించారు. అవయవదానం చేయాలని వైద్యులు అభ్యర్థించగా ఆమె కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఆమె కిడ్నీని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి, గుండెను, లివర్‌ను తిరుపతికి తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. తిరుపతికి హెలికాప్టర్‌లో తరలించిన గుండె, లివర్‌ను గ్రీన్ ఛానల్ ద్వారా ఆస్పత్రులకు చేర్చారు. మధ్యాహ్నం 12.30 గంటలకు గుండె శ్రీ పద్మావతి హృదయాలయానికి, లివర్ స్విమ్స్ ఆస్పత్రికి చేరుకున్నాయి.హృదయాలయ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ రెడ్డి ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాకు చెందిన బాబూరావు(48)కు ఆ గుండెను వైద్యులు సుమారు 7 గంటలపాటు శ్రమించి అమర్చారు. దీంతో హృదయాలయ ఆస్పత్రిలో వరుసగా 14వ గుండె మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా ముగిసినట్లైంది.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

మే 15 నుంచి ఇంటర్ దరఖాస్తుల జారీ
22 నుంచి జూలై ఒకటి వరకు రెండు దశల్లో ప్రవేశాలు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 13: 2024-25 సంవత్సరానికి సంబంధించి జూనియర్ ఇంటర్‌లో ప్రవేశ ప్రక్రియ మే 15వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు తిరుపతి ప్రాంతీయ విద్యామండలి పర్యవేక్షణాధికారి (ఆర్ఐఓ) జీవీ ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. మొదటి విడతగా మే 15 నుంచి దరఖాస్తులు విక్రయించనున్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను తక్షణం సమర్పించిన వారికి అదే నెల 22 నుంచే ప్రవేశాలు ప్రారంభించనున్నారు. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ జూన్ 1వ తేదీ కాగా అదే రోజునుంచి ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి. జూన్ 10 నుంచి జూలై ఒకటో తేదీ వరకు రెండో దశ అడ్మిషన్లు జరగనున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, అన్ ఎయిడెడ్ కళాశాలల యాజమాన్యాలు ఈ మేరకు మాత్రమే ప్రవేశాలు నిర్వహించాలని ఆర్ఐఓ ఆదేశించారు. ముందుగా ప్రవేశాలు నిర్వహించే కళాశాలలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

అ'పర్మిట్' రాకపోకలు
- రవాణాశాఖ చెక్‌పోస్టు మూసివేతతో ప్రభుత్వ ఆదాయానికి గండి
- రోజువారీ పర్మిట్ లేకుండానే వచ్చివెళ్తున్న పక్క రాష్ట్ర వాహనాలు



మూసివేసిన చెక్‌పోస్టు

తడ, ఏప్రిల్ 13: తడ మండలంలోని భీములవారిపాళెం వద్ద ఉన్న రవాణాశాఖ చెక్‌పోస్టు మూసివేతతో పర్మిట్ లేకుండానే ఇతర రాష్ట్రాల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. అక్రమ సరుకు రవాణాను అడ్డుకునేందుకు, రాష్ట్రాల మధ్య తిరిగే వాహనాలకు పర్మిట్లు మంజూరు చేసేందుకు దశాబ్దాల క్రితం చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. అయితే చెక్‌పోస్టులు అవినీతికి నిలయాలుగా మారిపోయాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం 2017లో జీఎస్టీని అమల్లోకి తెచ్చి చెక్‌పోస్టులను ఎత్తివేసింది. ఫలితంగా వాణిజ్య పన్నులశాఖ ఆధ్వర్యంలో నడిచే చెక్‌పోస్టులన్నీ దేశవ్యాప్తంగా మూతపడ్డాయి. ఆ తరువాత రవాణాశాఖ ఆధ్వర్యంలో నడిచే చెక్‌పోస్టులను ఎత్తివేయాలని, అవసరమైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ఆ ప్రకారం కొద్ది రోజుల క్రితం తడ మండలంలోని భీములవారిపాళెం వద్ద ఉన్న రవాణాశాఖ చెక్‌పోస్టులను మూసివేశారు. అవసరమైన సేవలన్నీ ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో అక్రమ వసూళ్లకు చెక్‌పడింది. వాహనాలు చెక్‌పోస్టు వద్ద ఆగకుండా నేరుగా వెళ్లిపోతున్నాయి. అయితే కొంతమంది వాహనదారులకు ఇది వరమవుతోంది. ముఖ్యంగా ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలు మన రాష్ట్రంలో ప్రయాణించాలంటే తప్పనిసరిగా మన రాష్ట్ర పర్మిట్ ఉండాలి. ఎనిమిది సీట్ల కారు నుంచి బస్సులు, ట్రైలర్ లారీలు వంటి అన్ని రకాల వాహనాలు పర్మిట్లతోనే రాష్ట్రంలో అడుగుపెట్టాలి. అలా వారంరోజులు పర్మిట్ పొందిన వాహనం రాష్ట్రంలో ఒక ట్రిప్పు రాకపోకలకు అనుమతి ఉంటుంది. అందుకుగాను ఎనిమిది సీట్ల కారుకు రూ.2650, ట్రక్కు, ఆటో వంటి వాటికి రూ.300, మినీలారీ నుంచి లారీ వరకు రూ.900 నుంచి రూ.1600 వరకు, ట్రైలర్ వంటి భారీ వాహనాల నుంచి రూ.3,600 నుంచి రూ.4,000 వరకు పర్మిట్ల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. పరిశ్రమలు తమ ఉద్యోగులను తరలించే బస్సు యజమానులు రెగ్యులర్ పర్మిట్ బస్సులు కాకుండా ఆ స్థానంలో స్పేర్ బస్సులను తిప్పాల్సివస్తే బస్సులోని ఒక్కొక్క సీటుకు రూ.900 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. అయితే చెక్‌పోస్టు ఎత్తివేయడంతో వాహనదారులకు కలిసివస్తోంది. భీములవారిపాళెం చెక్‌పోస్టు నుంచి శ్రీసిటీ సెజ్‌కు కేవలం రెండు కిలోమీటర్లు కాగా, మాంబట్టు సెజ్ పది కిలోమీటర్ల దూరంలో ఉండటంతో కొన్ని వాహనాలు ఎటువంటి పర్మిట్లు లేకుండానే ఆయా సెజ్‌ల వరకు ప్రయాణించి వెళ్తున్నాయి. ఇలా తమిళనాడు నుంచి రోజుకు సరాసరిన 450నుంచి 500 వాహనాలు వచ్చి వెళ్తున్నట్లుగా ప్రాథమిక అంచనా. రోజుకు సరాసరిన 3 నుంచి 4 లక్షల రూపాయల వరకు ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. చెక్‌పోస్టు ఎత్తివేయడం, తనిఖీలు లేకపోవడంతో కొన్ని వాహనాలు పర్మిట్ లేకేండా వచ్చి వెళ్లిపోతుండటంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. దీనికి అడ్డుకట్టవేయకపోతే త్రైమాసిక పన్నులు చెల్లించి తిరిగే బస్సులు సైతం ఇదేదారి పట్టే ఆస్కారం ఉంది. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని ఇటువంటి అక్రమాలకు చెక్‌పెట్టేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

బీజేపీతోనే దేశాభివృద్ధి: వరప్రసాద్



రోడ్ షోలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వరప్రసాద్, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(ఉపాధ్యాయ నగర్), ఏప్రిల్ 13: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. శనివారం సాయంత్రం ఆయన తిరుపతి నగరంలోని మున్సిపల్ పార్కుకు వెళ్లి అక్కడ వాకింగ్ చేస్తున్న యువకులతో మాట్లాడారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధిని వారికి వివరించారు. అక్కడ నుంచి టీ దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వద్దకెళ్లి స్థానికులతో మాట్లాడారు. బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం కేటీ రోడ్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులతో కలిసి వరప్రసాదరావు రోడ్ షో ద్వారా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు యుగంధర్, దామోదర్, మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే తిరుపతిలోని టెంపుల్ టౌన్ కాలనీలో ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు సతీమణి కొల్లూరి లక్ష్మి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె కాలనీవాసులతో మాట్లాడుతూ వరప్రసాదరావు తిరుపతి ఎంపీగా పనిచేసిన ఐదేళ్ల కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారని అన్నారు. అటువంటి వ్యక్తికి వైసీపీలో ఎన్నో అవమానాలు ఎదురయ్యాయని, సహించలేక ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారని చెప్పారు. తిరుపతి పార్లమెంటు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు. కమలం గుర్తుపై ఓటేసి ఎంపీగా వరప్రసాదరావును, గాజు గ్లాసు గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా ఆరణి శ్రీనివాసులును గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



టెంపుల్‌టౌన్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న కొల్లూరి లక్ష్మి

ముక్కంటి వెండిని అమ్మేసిన ఎమ్మెల్యే మధు...!
- ఆధారాలతో సహా బయట పెడతానన్న అనుచరుడు
- ప్రాణ రక్షణ కల్పించాలని ఎస్పీకి వినతి



తిరుపతిలో మీడియాతో మాట్లాడుతున్న హేమచంద్రారెడ్డి

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 13: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి భారీ అక్రమాలకు పాల్పడ్డారంటూ ఆయన అనుచరుడు హేమచంద్రారెడ్డి సంచలన ప్రకటన చేశారు. ఏకంగా ముక్కంటి ఆలయంలోని వెండిని బెంగళూరులో అన్ని సొమ్ము చేసుకోవడంతోపాటు... కరోనా సమయంలో మద్యం దుకాణాలను లూటీ చేసి బ్లాక్‌లో విక్రయించారని వెల్లడించారు... ప్రస్తుతం తాను పార్టీ మారుతున్న నేపథ్యంలో బెదిరింపులకు గురి చేస్తున్నారని వాపోయారు. తనకు ప్రాణ రక్షణ కల్పించాలని తిరుపతి ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వివరాలు ఆయన మాటల్లో... 'నా పేరు చంద్రశేఖర్ రెడ్డి.. శ్రీకాళహస్తికి చెందిన నేను 13 ఏళ్ల నుంచి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డికి అనుచరుడిగా ఉన్నా. వైసీపీ శ్రీకాళహస్తి మొదటి విద్యార్థి సంఘం నాయకుడిగా పనిచేశా. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే నన్ను ప్రభుత్వ మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా చేర్పించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెండిని ఎమ్మెల్యే సతీమణి, అత్త బెంగళూరులో అమ్మేశారు. వారి ముగ్గురి పథకం ప్రకారం నేనే బెంగళూరుకు తీసుకెళ్లి వెండిని భారతి అనే మహిళకు విక్రయించా. వెండి కొనుగోలు చేసిన మహిళ ఖాతా నుంచి నా బ్యాంకు ఖాతాకు రూ.10 లక్షల నగదు కూడా జమ చేశారు. ఆ తర్వాత 2020వ సంవత్సరం మార్చి నెలలో లాక్‌డౌన్ సందర్భంగా మద్యం దుకాణాలు మూసేశారు. అదే అదునుగా ఎమ్మెల్యే రాత్రివేళ మద్యం దుకాణాల్లోని సరుకును నా చేత ఖాళీ చేయించారు. ఆ తర్వాత పదింతల అధిక ధరతో మద్యం బ్లాక్‌లో విక్రయించుకున్నారు. వ్యక్తిగత కారణాలతో రెండేళ్లుగా ఎమ్మెల్యేకి నేను దూరంగా ఉంటున్నా. ఎన్నికల సమయం సమీపించడంతో వేరే పార్టీలో చేరాలని భావించా. ఆ విషయం తెలుసుకున్నప్పటి నుంచి ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి నన్ను ప్రలోభాలకు గురి చేయడం ప్రారంభించారు. నేను లొంగకపోవడంతో ఇంటి వద్దకు మనుషులను పంపించడం, ఫోన్లు చేసి బెదిరించడం చేస్తున్నారు. అయినా నేను లోబడకపోవడంతో నా వ్యక్తిగత అవసరాల కోసం ఇతరుల దగ్గర పెట్టిన ఇంటి పత్రాలు, స్టాంప్ పేపర్లు, ఖాళీ చెక్కులను ఎమ్మెల్యే తెప్పించుకున్నారు. తనకు లొంగకపోతే వాటితో ఇబ్బంది పెడతానని బెదిరిస్తున్నారు. శ్రీకాళహస్తిలో తిరిగే పరిస్థితి కూడా లేకుండా భయాందోళనకు గురి చేస్తున్నారు. అందుకే రక్షణ కోసం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశా. నా దగ్గర మద్యం స్కాంకు సంబంధించి పక్కాగా ఆడియో రికార్డులన్నీ ఉన్నాయి. అలాగే ముక్కంటి ఆలయ వెండిని బెంగళూరులో అమ్మిన సందర్భంలో ఆడియో కాల్ రికార్డింగ్ లు, బ్యాంకులో నగదు జమ చేసిన ఆధారాలు పక్కాగా ఉన్నాయి. అన్నింటిని అధికారుల వద్ద బహిర్గతం చేస్తా. నాలాగే ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితులుగా ఉన్న మరికొందరు బయటపడలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. త్వరలో వారు కూడా ఎమ్మెల్యే అరాచకాలను బహిర్గతం చేసే అవకాశం ఉంది.' అని హేమచంద్రారెడ్డి వివరించారు.

దొంగ ఓట్ల సూత్రధారులపై కేసులు నమోదు చేయండి
ఏఎస్పీ వెంకట్రావుకు కూటమి నేతల వినతి



ఏఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న కూటమి నేతలు

తిరుపతి(నేరవిభాగం)/కలెక్టరేట్, ఏప్రిల్ 13: తిరుపతిలో దొంగ ఓట్ల సృష్టికర్తలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు శనివారం తిరుపతి అదనపు ఎస్పీ వెంకట్రావును, డీఆర్వో పెంచలకిషోర్‌ను కోరారు. ఈ మేరకు వారికి వినతిపత్రం అందజేశారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ దొంగ ఓట్లు..కరెన్సీ నోట్లతో గెలవాలని చూస్తే తగిన రీతిలో బుద్ధి చెబుతామన్నారు. తిరుపతిలో కొందరు అధికారులు అధికార పార్టీతో అంటకాగుతున్నారని, తీరు మార్చుకోకపోతే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఎపిక్ కార్డుల డౌన్‌లోడ్ కేసు నీరుగారుతోందని, దీనిపై ఎన్నికల కమిషన్ దృష్టి పెట్టాలని కోరారు. టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి నరసింహయాదవ్ మాట్లాడుతూ తిరుపతిలో దాదాపు 38,493 దొంగ ఓట్లు ఉన్నాయని, కూటమి నాయకులు ఇంటింటికీ తిరిగి 6వేల ఓట్లను గుర్తించి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామన్నారు. జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ దొంగ ఓట్లు సృష్టించడంలో 80 శాతం వైసీపీ నాయకుల పాత్ర ఉందన్నారు. సూత్రధారులపై కేసులు నమోదు చేసి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కిరణ్‌రాయల్, సామంచి శ్రీనివాసులు, అజయ్‌కుమార్, జేఎంసీ శివ వారి వెంట ఉన్నారు.



డీఆర్వో పెంచలకిషోర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌డీఏ నేతలు

సూపర్‌సిక్స్ పథకాలతో టీడీపీ విజయం



కదిరిమంగళంలో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

వడమాలపేట, ఏప్రిల్ 13: ఎన్నికల హామీలుగా సూపర్‌సిక్స్ పథకాలే టీడీపీని గెలిపిస్తుందని చిత్తూరు పార్లమెంటు తెలుగు మహిళా కార్యదర్శి లక్ష్మీప్రసన్న చెప్పారు. శనివారం కదిరిమంగళం పంచాయితీ పరిధిలోని గ్రామాల్లో టీడీపీని గెలిపించాలని కోరుతూ కరపత్రాలు అందజేశారు. నగరి ఎమ్మెల్యేగా గాలి భానుప్రకాష్‌ను గెలిపించాలని కోరారు. ప్రచారంలో జానా వెంకటయ్య, ధనంజయలు నాయుడు, కుమారి బత్తినాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, వెంకట్రామానాయుడు, సుందర్ నాయుడు, పూర్ణ, రవి, రాము, ఆదినారాయణ, అంజేయ్య, బాలకృష్ణ, వెంకటేశ్వర రావ్, దేవ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పురుషోత్తం



పురుషోత్తం, మురళీ రెడ్డి

పుత్తూరు, ఏప్రిల్ 13: పుత్తూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా పురుషోత్తం, ఉపాధ్యక్షుడుగా రాజారెడ్డి, కార్యదర్శిగా మురళీ రెడ్డి, ఉప కార్యదర్శిగా భాస్కరరావు, కోశాధికారిగా దిలీప్‌రెడ్డి ఎన్నికయ్యారు.

వ్యాఘ్ర వాహనంపై భావనారుషి కటాక్షం



నారాయణవనం, ఏప్రిల్ 13: మండలంలోని పాలమంగలం ఉత్తరంలో వెలసిన భద్రావతి సమేత భావనారుషిస్వామి ఉత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్లు వ్యాఘ్ర వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఉదయం ఆలయంలో మూలవర్లకు అభిషేకాలు చేసి నిత్య కైంకార్య పూజలు చేపట్టారు. రాత్రి స్వామి అమ్మవార్లకు పులివాహనంపై అధిరోహింపజేసి పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



సుబ్రహ్మణ్యం (ఫైల్‌ఫొటో)

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 13: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన పుత్తూరులో జరిగింది. స్థానికుల కథనం మేరకు... మండల పరిధిలోని వేణుగోపాలపురానికి చెందిన సుబ్రహ్మణ్యం(60), నరసింహులు శనివారం వేకువజామున రేణిగుంటలోని సంతకు బయలుదేరారు. మజ్జిగగుంట వద్ద నడిచి వెళుతుండగా పుత్తూరు నుంచి తిరుపతి వైపు వెళుతున్న కారు వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతి చెందాడు. నరసింహులు స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించాడు. సీసీ టీవీ ఫుటేజుల ఆధారంగా ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు తడ వద్ద అదుపులోకి తీసుకున్నారు. కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పుత్తూరు, ఏప్రిల్ 13: పుత్తూరు మండలంలోని పోలింగ్ కేంద్రాలను నగరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వెంకటరెడ్డి శనివారం తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఆయన వెంట ఆధ్వర్యంలో తహసీల్దారు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీవో ప్రసాద్, ఎంఈవోలు భాస్కరరాజు, బాలసుబ్రహ్మణ్యం ఉన్నారు.

టీడీపీకి అభివృద్ధే నినాదం... రోజాకి అవినీతే ప్రధానం: భాను



ఇంటింటి ప్రచారంలో గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 13: టీడీపీకి అభివృద్ధే నినాదం కాగా, రోజాకి మాత్రం అవినీతే ప్రధానమని నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ ధ్వజమెత్తారు. శనివారం పుత్తూరు పట్టణ పరిధిలోని 15వ వార్డు రామారావు కాలనీ, రామానాయుడు కాలనీ, ఎంబీ రోడ్డులో వార్డు అధ్యక్షుడు సీఎం శరవణ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముద్దుకృష్ణమ నాయుడు హయాంలో పుత్తూరులో జరిగిన అభివృద్ధిని గుర్తు చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన అవినీతిని ప్రస్తావించారు. ప్రతి పనికీ రేటు కట్టి వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు గుప్పించారు. శాంతిభద్రతలు పూర్తిగా అడుగంటిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పుత్తూరు అభివృద్ధితో పాటు చంద్రబాబు ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుతో ప్రతి కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డి.ప్రసాద్‌రావును గెలిపించుకోవాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పుష్పలత, జలకం సునీల్, గోపీనాథ్, చాన్‌బాషా, రఫీ, శ్రీనివాసులు రాజు, కృష్ణమూర్తి, గాలి జీవరత్నంనాయుడు, ఎస్ఎన్ ధనపాల్, ఎల్లంటి ప్రసాద్‌నాయుడు, మాధవనాయుడు, యుగంధర్, ఆనంద్, కరుణాయాదవ్, కోలా సుధాకర్, లక్ష్మణాచారి, రమేష్, జీ.బాబు, ఖాజాపీర్, జనసేన సమన్వయకర్త మెరుపుల మహేష్, బీజేపీ కన్వీనర్ కేఎన్ హరిబాబు పాల్గొన్నారు.

ఒక్కచాన్స్ అంటూ ప్రజలను మోసం చేసిన జగన్



సమావేశంలో వామపక్ష నాయకులు

పుత్తూరు టౌన్, ఏప్రిల్ 13: ఒక్కచాన్స్ అంటూ జగన్ ప్రజలను మోసం చేశారని నగరి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రాకేష్ రెడ్డి, వామపక్ష నాయకులు అన్నారు. శనివారం పుత్తూరులో నియోజకవర్గ కాంగ్రెస్, వామపక్ష నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో జగన్ పేదల కడుపు కొడుతూ, కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. ఆదివారం సాయంత్రం పుత్తూరు పట్టణంలోని కార్వేటనగరం రోడ్డులో పీసీసీ అధ్యక్షురాలు షర్మిలా ఆధ్వర్యంలో బహిరంగ సభ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు విజయ్, భాస్కర్, యాసీన్ బాషా, పురుషోత్తం, బాబు, చిరంజీవి, సీపీఐ నాయకులు నాగరాజు, కోదండయ్య, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాల అంకురార్పణ

నారాయణవనం, ఏప్రిల్ 13: కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయానికి అనుబంధ ఆలయమైన మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల అంకురార్పణ వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలు, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 5.30 గంటలకు గణపతి ఉత్సవం నిర్వహించి, పుర వీధులలో ఊరేగించారు. 6.30 గంటలకు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిపారు. కార్యక్రమంలో ఆలయాధికారి నాగరాజు, ఏఈవో పార్థసారధి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కళ్యాణ వెంకన్న ఊంజలసేవ



నారాయణవనం, ఏప్రిల్ 13: నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకన్న ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు. స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు చేపట్టారు. అనంతరం స్వామివారిని, శ్రీదేవి, భూదేవి ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ బట్టాచార్య, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజల సేవ నిర్వహించారు. భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. ఆలయాధికారులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.99 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.99 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది.

సీతారాముల కల్యాణ ఏర్పాట్ల పరిశీలన

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13: ఈ నెల 17వ తేదీన ముక్కంటి ఆలయం తరఫున పట్టణంలోని నెహ్రూ వీధిలో వెలసిన పట్టాభి రామస్వామి ఆలయం వద్ద సీతారాముల కల్యాణం వేడుక జరగనుంది. ఈ ఉత్సవానికి అవసరమైన ఏర్పాట్లను ఈవో నాగేశ్వరరావు ఆలయ అధికారులతో కలిసి పరిశీలించారు. చలువ పందిళ్లు, క్యూలైన్లు, భక్తుల సౌకర్యాలపై చర్చించారు. పందిళ్ల ఏర్పాటును పరిశీలించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ మళ్లింపు, బందోబస్తు అంశాలపై శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ నరసింహారావుతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ఏకాంబరం, ఈఈ నూకరత్నం, ఏఈవో సతీష్ మల్లి, ట్రాఫిక్ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు విద్యుత్ గంట వితరణ



తొట్టంబేడు, ఏప్రిల్ 13: శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థి హేమకుమార్ శనివారం విద్యుత్ గంటను పాఠశాలకు వితరణ చేశాడు. పొదుపు చేసిన సొమ్ము రూ.8వేలతో గంటను అందించాడు. హెచ్‌ఎం రాజకుమారి విద్యార్థిని అభినందించారు. ఉపాధ్యాయులు సురేష్, శాంతి, రమేష్‌రెడ్డి, మల్లికార్జున, రజియా, మురళి, అనూష, హిమబిందు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోరు జాగాలో ఆగని నిర్మాణ పనులు



రేణిగుంట, ఏప్రిల్ 13: డీఎల్‌పీవో నోటీసులు ఇచ్చినా బోరుజాగాలో ఇంటి నిర్మాణ పనులు ఆగడం లేదు. పంచాయతీ పరిధిలో బోరు జాగాలో ఇంటి నిర్మాణంపై కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ విషయంపై ఉన్నతాధి కారులకు స్థానిక నాయకులు ఫిర్యాదు చేయడంతో ఈ విషయంపై పంచాయతీ డీఎల్‌పీవో ప్రభురెడ్డి ఈ నెల 6న పంచాయతీ కార్యాలయంలో విచారణ చేశారు. నివేదికలను జిల్లా ఉన్నతాధికారులకు పంపారు. తర్వాత బోరు జాగాలో ఎలాంటి నిర్మాణ పనులు చేయకూడదని అలాకాకుండా నిర్మాణ పనులుచేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని స్థానిక పంచాయతీ ఈవో ద్వారా నోటీసులు జారీ చేశారు. అయినా వారం రోజులుగా ఇంటి నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



గురుదక్షిణామూర్తి సన్నిధిలో వంటలక్క

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13: ముక్కంటి ఆలయాన్ని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఐఏఎస్ అధికారి ప్రవీణ్ కుమార్ కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఈవో నాగేశ్వర రావు వారికి దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. ప్రముఖ బుల్లితెర నటి ప్రేమి విశ్వనాథ్ (వంటలక్క) ఆలయానికి విచ్చేశారు. సహస్ర లింగం వద్ద రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13: ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. రెండవ శనివారం వారాంతపు సెలవులు కలిసి రావడంతో రద్దీ పెరిగింది. రాహుకేతు సర్ప దోష నివారణ పూజలకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. 28 వేల మంది దర్శించుకున్నట్లు అధికారుల అంచనా.

నేడు వైఎస్ షర్మిల బహిరంగ సభ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదివారం శ్రీకాళహస్తికి రానున్నట్లు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పోతుగుంట రాజేష్ నాయుడు శనివారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని బేరివారి మండపం వద్ద ఉదయం 10 గంటలకు షర్మిల సభ ఉంటుందని వివరించారు.

వైసీపీ రౌడీ పాలనకు అంతం పలుకుదాం



బొజ్జల సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న టైలర్లు, పవన్ కళ్యాణ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13: జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను సుధీర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి పర్యటనకు విచ్చేసిన పవన్ కళ్యాణ్‌ను కలిసి పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

టీడీపీలోకి వలసలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13: వైసీపీ రౌడీ పాలనతో జనం విసుగు చెందారని ఆ పాలనకు అంతం పలకాలని ఆపార్టీ నేత వీఎల్ నారాయణ ఆరోపించారు. శ్రీకాళహస్తికి చెందిన నవయుగ వ్యాపార సంస్థ నిర్వాహకులు నారాయణ వైసీపీని వీడి టీడీపీలో చేరారు. సుధీర్ రెడ్డి ఆయనకు టీడీపీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయ్ కుమార్, కంఠా రమేష్, కాసరం రమేష్ తదితరులు పాల్గొన్నారు. ● పట్టణంలోని 30వ వార్డుకు చెందిన వైసీపీ సానుభూతి పరులు రాజేశ్వరి, మునెమ్మ, ఆముద, ఎం.ఆముద, జ్ఞానమ్మ, సుజాతమ్మ, సరస్వ తమ్మ, సుబ్బారెడ్డి, నరసింహులతో సహా మొత్తం 40 మంది టీడీపీలో చేరారు. సుధీర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.

● శ్రీకాళహస్తి పట్టణం 35వ వార్డు పరిధిలోని ఇసుకదిబ్బ ప్రాంతానికి చెందిన చంద్ర ఆధ్వర్యంలో సుమారు వందమంది వైసీపీ సానుభూతిపరులు టీడీపీలో చేరారు. బొజ్జల సుధీర్ రెడ్డి కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు. శ్రీకాళహస్తికి గోపాలన్న పాలన తిరిగి తెచ్చుకోవలసిన అవసరం ఎంతో ఉందని వలస వచ్చిన నాయకులు అభిప్రాయపడ్డారు.

ప్రజాసేవే ఆశయం

ప్రజాసేవే తన జీవిత ఆశయమని సుధీర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని 29, 30, 35వ వార్డుల్లో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో కలిసి ఇంటింటికి ప్రచారం చేశారు. రైల్వే స్టేషన్ వద్ద స్థానిక టీడీపీ నాయకులు క్రేన్‌తో భారీ గజమాలతో ఆయనకు స్వాగతం పలికారు. బీజేపీ నాయకులు కండ్రిగ ఉమ పాల్గొన్నారు.

తొట్టంబేడు: దర్జీలు దర్జాగా బతకాలంటే టీడీపీని గెలిపించుకోవాలని బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరులో శనివారం టైలర్లతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. టైలర్లకు సబ్సిడీతోలోన్లు, కుట్టుమిషన్లు, పనిముట్లను ఇప్పించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. టైలర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి టైలర్ల కోసం ఇంటి స్థలాలు కేటాయించి టైలర్స్ కాలనీ ఏర్పాటు చేస్తే వైసీపీ నాయకులు టైలర్ల ఇంటి స్థలాలను కబ్జా చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించు కుంటామన్నారు. పట్టణంలోని టైలర్లు పాల్గొన్నారు.

బృందమ్మ పరామర్శ

ఏర్పేడు: మేర్లపాకలో వేదాం చంద్రమౌళి శనివారం మృతిచెందాడు బొజ్జల బృందమ్మ అతడి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



టీడీపీలో చేరిన వీఎల్ నారాయణ తదితరులు

ఇళ్ల నిర్మాణాలపై ఇరువర్గాల ఘర్షణ

● మద్యం మత్తులో మహిళలపై దాడి ● వివేకానంద కాలనీలో ఘటన



పేదల ఇళ్లను కూల్చేస్తున్న యువకులు, మహిళలపై దాడులు చేస్తున్న యువకులు

రేణిగుంట, ఏప్రిల్ 13: రేణిగుంట పంచాయతీ పరిధిలోని వివేకానంద కాలనీలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. మద్యం మత్తులో యువకులు విచక్షణా రహితంగా మహిళలపై దాడి చేశారు. వివేకానంద కాలనీలోని సర్వే నెంబరు 831లో 1421 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో రెండు నెలల క్రితం వైసీపీ నాయకురాలు కాల్వ పోరంబోకు స్థలంలో ఓ వైపు 40 ఇళ్లు నిర్మించారు. వాటిని బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అదే సమయంలో రేణిగుంటకు చెందిన పేదలకు జగనన్న ఇంటి పట్టాలు ఏర్పేడు మండలం పాగలి వద్ద ఇచ్చారు. అక్కడ ఆ భూమి కోర్టు వివాదంలో ఉండటంతో స్థానిక పేదలు సీపీఎం అండతో కాల్వ పోరంబోకు స్థలంలో మరోవైపు రేకుల ఇళ్లను నిర్మించుకున్నారు. అయితే ఇక్కడ ఇళ్లు నిర్మించు కోకూడదని స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులు రెండుసార్లు అక్రమ నిర్మాణాలను అడ్డు కున్నారు. ఆ సమయంలో వైసీపీ నేతలు, సీపీఎం నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. వైసీపీ నేతల ఇళ్లను తొలగిస్తే తాము నిర్మించిన ఇళ్లు తొలగిస్తామని తేల్చి చెప్పడంతో అక్కడి నుంచి అధికారులు వెళ్లిపోయారు. అప్పటి నుంచి వివాదం కొనసాగుతోంది. ఇటీవల తూకివాకం పంచాయతీకి చెందిన కొంతమంది యువకులు సైతం ఇక్కడ ఇళ్లు నిర్మించవద్దు అని రెండుసార్లు గొడవ చేశారు. ఈ క్రమంలో శనివారం 70మంది యువకులు మద్యం మత్తులో కర్రలతో అక్కడ ఉన్న మహిళలపై దాడికి దిగారు. ఏడు ఇళ్లను కూల్చివేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఇరు వర్గాలను పంపించేశారు. ఈ విషయంపై సీపీఎం మండల అధ్యక్షుడు హరినాథ్ మాట్లా డుతూ స్థానిక ప్రజాప్రతినిధి వారి అనుచరులను పంపించి పేదలు నిర్మించిన ఇళ్లల్లో పది ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. తాము అంగీకరించక పోవడంతో స్థానిక యువకులను రెచ్చగొట్టి గొడవలు సృష్టిస్తున్నారని ఆరోపించారు.

అదనపు ఎస్పీకి ఫిర్యాదు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 13: వైసీపీ నాయకులు తమ ఇళ్లను కూల్చేశారని ఆదుకోవాలని బాధితులు తిరుపతి అదనపు ఎస్పీ వెంకట్రావుకు ఫిర్యాదు చేశారు. దాదాపు 10 మంది మహిళలు గాయపడ్డారని వాపోయారు. ఈ సందర్భంగా రేణిగుంట సీఐటీయూ కార్యదర్శి నరసింహారెడ్డి మాట్లాడుతూ వైసీపీ నాయకుల ఇళ్ల జోలికి వెళ్లకుండా పోలీసులు తమపైనే కేసులు నమోదు చేస్తామని బెదిరించారని పేర్కొన్నారు. కాగా తిరుపతిలో కూటమి అభ్యర్థులు బాధితులను పరామర్శించారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సారీ ఎన్నికల్లో వైసీపీని ఓడించాలని కోరారు.



బాధితులతో మాట్లాడుతున్న కూటమి నాయకులు

మృతుడు వీఎం.పల్లి వాసి



గురుస్వామి (ఫైల్‌ఫొటో)

తొట్టంబేడు, ఏప్రిల్ 13: మండలంలోని కల్లిపూడి గ్రామం వద్ద తెలుగుగంగ కాలువలో శుక్రవారం లభ్యమైన గుర్తుతెలియని మృతదేహం వివరాలు గుర్తించినట్లు తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. మృతుడు శ్రీకాళహస్తి పట్టణం వీయంపల్లికి చెందిన ఆటో డ్రైవర్ గురుస్వామి(47)గా గుర్తించారు. శనివారం పోస్టు మార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు మృత దేహాన్ని అప్పగించారు. మృతుడికి భార్య చాముండేశ్వరి ఉంది.

రాక్షస పాలన వద్దు చంద్రన్న పాలనే ముద్దు



కొత్త గొల్లకండ్రిగలో ఆదిమూలానికి సన్మానం

పిచ్చాటూరు, ఏప్రిల్ 13: 'రాష్ట్రంలో కొనసాగుతున్న రాక్షస పాలన వద్దు రామరాజ్యం లాంటి చంద్రన్న పాలనే ముద్దు' అని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం తెలియజేశారు. మండలానికి ఈశాన్యంలో ఉన్న రామగిరి అంకాలపరమేశ్వరి ఆలయంలో పూజలు నిర్వహించి శనివారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. రామగిరి, అడవికండ్రిగ, రెప్పాల పట్టు, లక్ష్మీవిలాసపురం, కొత్త గొల్లకండ్రిగ, అద్దాలమేడ, పాత గొల్లకండ్రిగ, తులసి కృష్ణాపురం, వెంకటరెడ్డి కండ్రిగ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ప్రెసిడెంట్ తిరుమలరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, నాయకులు సతీష్‌నాయుడు, పద్మనాభరాజు, సుమాంజలి, రవి, మల్లికార్జున్‌రెడ్డి, మాచర్ల రోశయ్య, సుబ్రహ్మణ్యం రాజు, వాసు, బాలరాజు, మురళి, బుజ్జినాయుడు, పద్దురాజు, జయచంద్రనాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు ఆనందనాయుడు, జనసేన మండల అధ్యక్షుడు దేవా తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అభ్యర్థిని అడ్డుకున్న దళితులు

నాగలాపురం, ఏప్రిల్ 13: నాగలాపురం మండల పరిధిలోని వేంబాక్కం గ్రామం దళితవాడలో శనివారం సత్యవేడు నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారాన్ని ఓ దళితుడు అడ్డుకున్నాడు. ఈ ఐదేళ్లలో తమ దళితవాడలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశాడు. వర్షం పడితే నీరు ఇళ్లలోకి చేరుతోందని నిలదీశాడు. ఆ సమయంలో వైసీపీ నాయకులకు, అడ్డుకున్న దళితుడికి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం తూతూ మంత్రంగా ప్రచారం నిర్వహించి వెనుదిరిగారు.

ఉక్కపోతతో విద్యార్థులు విలవిల

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13: శ్రీకాళహస్తిలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో శనివారం ఉక్కపోతతో విద్యార్థులు విలవిలలాడారు. శ్రీకాళహస్తిలో ప్రతి మాసం లాగే 2వ శనివారం విద్యుత్ శాఖ పరిధిలో మరమ్మతు పనులు చేపట్టారు. దీంతో ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రతి నెలా రెండవ శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిసినప్పటికీ ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు సెలవు అమలు చేయడం లేదు. ప్రస్తుతం నిప్పులు కొలిమిని తలపిస్తున్న ఎండలు ఉన్నా శనివారం తరగతి గదులు నిర్వహించారు. అయితే పాఠశాలల్లో కనీసం జనరేటర్, ఇన్వర్టర్ వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. మరీ ఇరుకు గదుల్లో ఉన్న కొన్ని పాఠశాలల్లో అయితే కనీసం లైట్లు కూడా అందుబాటులో లేవు. వేసవి తీవ్రతతో విద్యార్థులు అల్లాడిపోయారు. ఈ విషయమై పట్టణంలోని నారద పుష్కరిణి వద్ద ఉన్న ఓ ప్రముఖ పాఠశాలలో వివాదం చోటు చేసుకుంది. కొందరు తల్లిదండ్రులు మధ్యాహ్నం వేళ తమ పిల్లల దయనీయ పరిస్థితిని చూసి నిర్వాహకులను నిలదీశారు. కనీసం గాలి వెలుతురు కల్పించలేనప్పుడు ఎందుకు తరగతి గదుల నిర్వహించారంటూ తల్లిదండ్రులు వాగ్వాదానికి దిగారు. ఇదే తరహాలో పట్టణవ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

రోగుల వేదన

విద్యుత్తు అంతరాయంతో ప్రభుత్వ ఆస్పత్రిలో పురిటి బిడ్డలు, వృద్ధులు, మహిళలు, బాలింతలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. కనీసం జనరేటర్ సౌకర్యం కూడా లేకపోవడంపై రోగులు అసహనం వ్యక్తం చేశారు.

శ్రీకాళహస్తికి చేరిన ఈవీఎంలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 14: ఈవీఎంలు శనివారం రాత్రి శ్రీకాళహస్తికి చేరాయి. స్కిట్ కళాశాలలో ఈవీఎంలు భద్రపరిచేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మొత్తం 36 బాక్సులను స్కిట్‌కు చేర్చారు. ఒక్కో బాక్స్‌లో పది ఈవీఎంల చొప్పున మొత్తం 360 యంత్రాలు భద్రపరి చారు. స్కిట్ కళాశాల వద్ద ప్రత్యేక పోలీస్ బందోబస్తు చేపట్టారు.

స్థానికేతర అభ్యర్థులు ఆర్‌వో ధ్రువీకరణ పత్రం సమర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌వో నరసింహులు

సత్యవేడు, ఏప్రిల్ 13: మరో నియోజకవర్గంలో ఓటు హక్కు ఉండి ఇక్కడ పోటీచేసే అభ్యర్థులు అక్కడ ఆర్‌వో మంజూరుచేసిన ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలని తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గ ఎన్నికల అధికారి నరసింహులు స్పష్టం చేశారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్, అసిస్టెంట్ ఎన్నికల అధికారి రామాంజనేయులు ఆధ్వర్యంలో నామినేషన్ దాఖలు తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ఈ నెల 18 నుంచి నామినేషన్ దాఖలు ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు వరకు నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. నామినేషన్ దాఖలుకు అవసరమైన పత్రాలు, దరఖాస్తులు పూరించడానికి అభ్యర్థులకు సహకరించడానికి ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక్కో అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్లనామినేషన్ల పత్రాలు దాఖలు చేయవచ్చన్నారు. ఎన్నికల ఖర్చు కోసం అభ్యర్థి పేరు మీద వ్యక్తిగత అకౌంట్ తెరవాలన్నారు. ఎస్సీ రిజర్వుడ్ స్థానాల్లో పోటీచేసే అభ్యర్థులు నామినేషన్‌కు కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ డీటీ రవిచంద్రబాబు, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ సురేష్, వైసీపీ నాయకులు చందు, టీడీపీ దిలీప్, బీజేపీ మండల అధ్యక్షుడు ముని ప్రతాప్, సీపీఎం మండల కార్యదర్శి రమేష్, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాలగురవం బాబు పాల్గొన్నారు.

నెల రోజుల్లో రాష్ట్రం తలరాత మారుతుంది: ఆదిమూలం



సమావేశంలో ప్రశంగిస్తున్న ఎమ్మెల్యేఆదిమూలం

నాగలాపురం, ఏప్రిల్ 13: మరో నెల రోజుల్లో టీడీపీ అధికారంలోకి రానుందని రాష్ట్రం తలరాత మారనుందని సత్యవేడు ఎమ్మెల్యే, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. శనివారం నాగలాపురం మండలంలోని ఎస్ఎస్ పురం గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస యాదవ్ ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో వైసీపీ మద్యం, డబ్బు, దొంగ ఓట్లతో గెలిచేందుకు బరితెగిస్తోందని విమర్శించారు. నాగలాపురంలో మద్యం పట్టుబడితే పట్టుబడిన వారిని వదిలేయాలని మంత్రి పెద్దిరెడ్డి హుకూం జారీచేయడం ఏంటని ప్రశ్నించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పార్తీబన్, పరశురాం శిల్పి, అన్బు, మాతయ్య, రుద్రయ్య, చాన్‌బాషా, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వర స్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనీశ్వరస్వామికి విశేష పూజలు జరిగాయి. శనివారం పురస్కరించుకుని ముందుగా అర్చకులు శనీశ్వర స్వామి సన్నిధిని శుద్ధి చేశారు. భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. వివిధ పూజా ద్రవ్యాలతో పాటు శని ప్రీతికోసం విశేషంగా తైలాభిషేకం చేశారు. స్వామివారికి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించి విశే షాలంకరణతో దర్శనభాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

దారి దోపిడీ కేసులో ముగ్గురి అరెస్టు

● నిందితుల్లో ఇద్దరు ప్రేమజంట
● రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు, కత్తి స్వాధీనం



నిందితులను మీడియాకు చూపుతున్న పోలీసులు

సత్యవేడు, ఏప్రిల్ 13: దారి దోపిడీకి పాల్పడుతున్న ఓ యువతి, ఇద్దరు యువకులను సత్యవేడు పోలీసులు అరెస్టుచేశారు. సత్యవేడు పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సీఐ దివాకర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 23 రాత్రి 10 గంటల సమయంలో నాగలాపురం మండలం రాజులకండ్రిగ గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రాజు ఇంటి నుంచి శ్రీసిటీకి తన ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యంలో రంగనాథపురం గ్రామానికి సమీపంలో తెలుగు గంగ బ్రిడ్జి వద్ద ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వాహనాన్ని అడ్డగించి కత్తితో దాడిచేసి బైక్‌తో పాటు రూ.1500లు నగదు, మొబైల్ ఫోన్ లాక్కొని పరారయ్యారు. దీనిపై బాధితుడు చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఎస్ఐలు వీరాంజనేయులు, ప్రతాప్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అలాగే శ్రీసిటీ పరిధిలోని మల్లవారిపాళెం టౌన్‌షిప్ కాలనీలో గత నెల 10వ తేదీ ఓ ఇంటిలో రెండు సెల్‌ఫోన్‌లు, ఒక ద్విచక్రవాహనం అపహరణకు గురైంది. ఈ క్రమంలో శనివారం సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగంగా పట్టణంలోని ఉలవచేను సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న తమిళనాడు రాష్ట్రం గుమ్మడిపూడి తాలూకా పొందవాకానికి చెందిన కుప్పాని వంశీ(21), సత్యవేడు ఇరుగుళం గ్రామానికి చెందిన సంజయ్(20), చిత్తూరు జిల్లా విజయపురం మండలం ఆలపాకం గ్రామానికి చెందిన దేవిప్రియ(19)లను పోలీసులు అదుపులో తీసుకున్నారు. పైన పేర్కొన్న దోపిడీ, చోరీలు వీరే చేశారని విచారణలో తేలింది. కాగా సంజయ్, దేవిప్రియ ప్రేమికులు. తాగుడుకు, గంజాయికి బానిసలై కొంతకాలంగా దారి దోపిడీ, దొంగతనాలకు పాల్పడు తున్నట్లు వెల్లడైంది. ఈ కేసును ఛేదించిన పలువురు పోలీసులకు సీఐ నగదు ప్రోత్సాహక బహుమతులు అందించారు.